57398
57399

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

ఫిబ్రవరి 28, 2010

Entered

హాకీ పండుగ
హాలో ఇండియా

హ్యాపీ బర్త్‌డే

(2010 ఫిబ్రవరి 28నుంచి
2010 మార్చి 6 వరకు)

నీనా
మార్చి-1
రాధ-జయప్రకాష్
గుంటూరు

జి.తరుణ్
5సం॥, మార్చి-1
ప్రతిమ-శ్రీనివాస్
మలక్‌పేట్-హైదరాబాద్

డి. నవీన్‌కుమార్
1సం॥, మార్చి-1
ఉమామహేశ్వరి-వేణుగోపాలరావు
రాయగూడ-ఖమ్మం

ఎన్. చంద్రహాస్
4సం॥, మార్చి-2
సాధన-అశోక్‌వర్ధన్‌రావు
అప్పలనర్సింహాపురం
-ఖమ్మం

ఎన్. జయశ్రీ
7సం॥, ఫిబ్రవరి-2003
అరుణ-రామారావు
శ్రీకాకుళం

కె. లోహిత
3సం॥,ఫిబ్రవరి-2003
గీత-శ్రీనివాస్
మొఘల్‌రాజపురం
-విజయవాడ

జి. కృష్ణకుమార్
ఫిబ్రవరి
సుమలత
అర్సల్లి-నిజామాబాద్

టి. మురళీధర్
4సం॥, ఫిబ్రవరి-28
జ్యోతి-వెంకటరమణ
సాయినగర్-డోర్నకల్

వై. వైభవ్(యోగి)
3సం॥, ఫిబ్రవరి-2007
అనిత-భూమయ్య
రుద్రూర్-నిజామాబాద్

పి. శ్రావణి
3సం॥, ఫిబ్రవరి-2007
కీర్తి-కిరణ్
తిరుపతి

పవిత్ర
ఫిబ్రవరి
రాజేశ్వరి-సురేష్
రాఘవేంద్రనగర్-కర్నూల్

ENTERED

ప్రభుత్వ వ్యసనం



బాబులూ... మందు బాబులూ...పిచ్చపిచ్చగా రెచ్చిపోండి. రెచ్చిపోయి మందు కొట్టండి. మిమ్మల్ని అడ్డుకునేవాడే లేడు. పగలు రాత్రి అన్న ఆలోచనే వద్దు. మీకోసం వారుణీవాహినిలు తెల్లార్లూ బార్లా తెరిచే వుంటాయి. అవి బార్లు కావని సందేహించకండి. అంగళ్లనే బార్లుగా భావించండి. బాజాప్తాగా రోడ్డుమీదే నీళ్లో, సోడానో కలుపుకొని కొట్టండి. నీట్‌గా కొడ్తే మాకు మరీ మంచిది. శాంతిభద్రతల సమస్య అనో, న్యూసెన్సు అనో మేము అడ్డుపడం. మీ జోలికొస్తే ఒట్టు. ఈ ఫెసిలిటీ ఇప్పటికే వుందనుకోండి. అయినా మరోసారి మనవి చేసుకుంటున్నాం. రోజంతా కష్టపడండి. డబ్బుతో ఇంటికి మాత్రం వెళ్లకండి. నేరుగా వైన్ షాపులకు రండి. కంగారు పడకండి. చూడగలిగే కళ్లుండాలిగానీ అడుగడుగునా మందు అందుబాటులో వుంచాం. పాలు, నీళ్లు దొరికే చోటు లేకపోవచ్చుగానీ మందు దొరకని చోటంటూ మా ఇలాఖాలో లేదు మరి... డబ్బు లేదా! దిగులు చెందకండి!! మీ భార్యల జీతాలు, కూలీనాలీ వుండనే వుంటుంది. అవీ లేవా! నగానట్రా చెంబూ తపేలా ఏదుంటే అది అమ్మేయండి. వైన్ షాపులకు రండి. యదేచ్ఛగా తాగేయండి. మీకోసం నూరున్నొక్క బ్రాండ్లు సిద్ధం. మా కష్టం చూడండి. మీ జేబులు దులిపేసి వెళ్లండి. మీ జేబులే మా ఖజానాలు. రండి బాబు రండి. నడుచుకొంటు రండి. దొర్లుకొంటు వెళ్లండి. పైకి చెప్పకపోయినా ఇది మన ప్రభుత్వం వారి లిక్కర్ విధానం.

జనం తాగడం మానేస్తే సర్కార్ వారికి నవనాడులూ స్తంభించిపోతాయి. తాగేవారికి తాగేకొద్దీ మరింత తాగాలనిపిస్తుందట. జూదమాడేకొద్దీ ఆడాలనిపిస్తుందట. వ్యసనం పాలిటి ప్రథమ లక్షణం ఇదే. ప్రభుత్వానికీ ఈ వ్యసనం పట్టుకొంది. రాబడి పెంచుకోవాలంటే మద్యం అమ్మకాలు పెంచాలి. రెండేళ్ల క్రితం అంటే 2008-09లో మన రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం రు.5752 కోట్లు. 2009-10లో రు.6260 కోట్లు. 2010-11లో రు.7512 కోట్లు. తాగుడు వ్యసనం ఎంత విస్తరిస్తే ప్రభుత్వానికి అంత లాభం. ఖజానాకు చేరేది ఇలా లెక్కల్లో కన్పిస్తే... కన్పించకుండా తమ అనుచరులకు చేరేది మరింత ఎక్కువ.

మన సిఎం గారు... టీ టోటలర్. డెటాల్‌తో శుద్ధిచేస్తేగానీ ఖాళీ చేసిన లిక్కర్ గ్లాసునైనా ముట్టరు. .. ఆయన తాగరు... తాగిస్తారు. జనం తాగకపోతే సర్కారుకు గడవదంటారు. అధినేత అంతరంగం తెలిసిన అంతేవాసులు ఊరుకొంటారా... ఇప్పటికే బెల్టు షాపులతో ఊళ్లను నింపేశారు. ఇక మరింత కష్టపడతారు. ఎవరెంత బొక్కితేనేం... తమ బొక్కసం నిండితే చాలు సర్కార్ వారికి.

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
కథ	...	8
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
దాన ధర్మాల వెనుక...		
బాబోయ్!!	...	17
సీరియల్	...	18
క్రైమ్‌కథ	...	20
తెలుసుకుందామా	...	21
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

దేశంకోసం...
ప్రాణం తృణప్రాయం

సినిమా కబుర్లు ... 10

'సదాజప' హాస్యరసస్రష్ట
పద్మనాభం





చూద్దామా ... 22

నేల తల్లికి పూల 'కడియం'



కళ్లు తెరిపించిన 'సూక్ష్మం'

ప్రేమజంట ముఖచిత్రంతో మా ముందుకొచ్చిన స్నేహ సంచిక 'అట్టమీది కథ'గా 'ప్రేమికులకు ఒక రోజ్' ఆసక్తిదాయకంగా వుంది. 'చూద్దామా' ద్వారా అమరావతి ప్రాంతాన్ని సందర్శించగలిగాం. సీసాల ఇల్లు ఉదంతం అబ్బురపరిచింది. ధారావాహిక కథ 'సీతాకోకచిలుక'లను అందించిన సాహిల్‌కు ధన్యవాదాలు. 'సినిమా కబుర్లు' ప్రేమమయంగా అలరింపచేసింది. 'ఆరోగ్యం' ద్వారా ఆత్మహత్యాయత్నం అన్నది నేరం, పాపమే కాక అనారోగ్యకరమని గ్రహించాం. సూక్ష్మంలో మోక్షం పొందుదామని సోనాబెల్ట్ కొనేవారికి కళ్లు తెరుచుకునేలా సత్యగారి శీర్షిక రూపుదిద్దుకుంది. 'స్ఫూర్తి' ద్వారా వేయిపడగలు పుస్తక ప్రాముఖ్యత తెలిసింది. జెన్నీమార్క్స్... పుస్తకం నుండి గ్రహించిన కథ చదవటం చక్కని అనుభూతిని కలిగించింది. 'మనలోమాట' జాగరణ చేయకూడదనుకునే వారికి సైతం అనివార్య కారణాల మూలంగా... (జన్మకో) శివరాత్రిలా గడిచిపోవడం గమనార్హం.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

ఆకట్టుకున్న అమరావతి

ఫిబ్రవరి 14 ఆదివారం అనుబంధంలో 'చూద్దామా' పేజీల్లో 'అద్భుత శిల్పాల ఝరి అమరావతి' చదివి అనేక విషయాలు తెలుసుకున్నాం. భిన్న సంస్కృతులకు నిలయమైన సిద్ధార్థుని జీవిత సంఘటనలు సాక్షాత్కారంగా వివరించే అమరావతి గుంటూరు జిల్లాలో నెలకొని వుండడం, ఒకనాడు వర్తక, వ్యాపారానికి నిలయంగా వుండడం, ఇక్కడ బౌద్ధ ఆరామాలు నెలకొని వుండి ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించడం విశేషం. 1797లో ఈ ప్రాంతాన్ని దర్శించిన కొలిన్‌మెకంజీ వీరి సంపదను బహిర్గతం చేయడం తదనంతరం అనేక పరిశోధనలు జరగడం, తర్వాత శిల్పకళా సంపద 125 శిల్పాలకు పైగా బ్రిటీష్ మ్యూజియంలో వుండడం, చెన్నై మ్యూజియంలో 350కి పైగా అమరావతి శిల్పాలు వుండడం అభినందనీయం. త్వరలోనే మా పాఠశాల విద్యార్థులందరితో అమరావతి వెళ్లడానికి ప్లాన్ చేస్తున్నాం. మంచి వ్యాసం అందించిన వ్యాసకర్తకు ధన్యవాదాలు.

కామిడి సతీష్‌రెడ్డి, ముదిగంటి వెంటకరెడ్డి, పరకాల, వరంగల్.

చూద్దామా చూడదగినదే

ఫిబ్రవరి 14 సంచికలో అద్భుత 'శిల్పాల ఝరి.... అమరావతి' వ్యాసం బాగుంది. అమరలింగేశ్వరస్వామి దేవాలయం వల్ల అమరావతి పేరు సార్థకనామధేయమైంది. ధాన్యకటకంలో అమరావతి శిల్పం అశోకుని బౌద్ధ రాతి ప్రాకారం చూడదగినవే.

ఆచార్య నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

తెలుగు వింతలు

ఫిబ్రవరి ఆదివారం అనుబంధం సంచికలో నండూరి రామ్మోహనరావు గారి అనుభవాల్ని చక్కగా తెలియజేశారు. పాత గ్రంథాల ఆధారంగా విశ్వరూపంగా, నరావతారం గ్రంథాలు వెలువరించిన వారికి నా అభినందనలు. ఇవి ఒకప్పుడు నేను కూడా చదివాను. శివరాత్రి సందర్భంగా పంచలింగ క్షేత్రాల వివరణ బాగుంది. కీటక చాక్లెట్లు కూడా వుంటాయంటే నమ్మశక్యంగా లేదు. వింతల లోకంలో తెలుగిన్నిస్ చాలా విశేషాలు తెలియజేసింది. 'బాలనేస్తాలు' బాలలకు ఉపయోగకరంగా ఆసక్తి కలిగించేలా వుంది.

విజయ్, నల్గొండ.

చక్కగా వివరించారు

ఈ వారం స్నేహ 'చూద్దామా'లో అమరావతి శిల్ప సౌందర్యాన్ని, అక్కడి ప్రాచీన చరిత్రను చక్కగా వివరించారు. అక్కడ నిర్మాణంలో వున్న జ్ఞాన బుద్ధుని విగ్రహ నిర్మాణం గురించిన వివరాలను, ఇంకా అక్కడ చూడాల్సిన ప్రదేశాలు ఏమేమి వున్నాయో కూడా ఈ శీర్షిక ద్వారా తెలుసుకున్నాం. 'ఆరోగ్యం' శీర్షికలో 'ఆ ఆలోచనే వద్దు' అంటూ ఆత్మహత్య



చేసుకోవాలనుకునే వారికి అర్థమయ్యేటట్లుగా ఇచ్చిన వివరణ కొందరిలోనైనా మార్పు తీసుకొస్తే బాగుంటుంది. ఈ ఆలోచన ఎప్పుడు ఎలా వస్తుందో తెలియదు కనుక ఇంట్లోవారు, స్నేహితులు కొద్దిగా అప్రమత్తంగా వుంటే మంచిది. శివరాత్రి డబ్బున్నోళ్లకి పండుగైతే పేదవాళ్లకి ప్రతిరోజూ శివరాత్రి పండుగేనేమో. ఈ వారం కథ నుండి నేటి యువజంటలు నేర్చుకోవాల్సింది చాలా వుంది. కష్ట నష్టాల్లో తోడు నీడగా వుండి ఒకరికోసం ఒకరుగా బతికిన ఆ జంట అందరికీ ఆదర్శప్రాయం. కవర్‌స్టోరీ 'ప్రేమికులకు ఒక రోజ్' అంటూ విజయ్‌గారు వాలెంటైన్స్ డే ఎలా వచ్చింది, ఎక్కడి నుండి ఈ పద్ధతిని దిగుమతి చేసుకున్నాం అనే అనేక వివరాలు చక్కగా వివరించారు.

వెంటకటేశ్వర్లు, విశాఖపట్నం.

★



ఢోక్లా

కావలసిన పదార్థాలు

శనగపిండి – 1 కప్పు, అల్లం పచ్చిమిర్చి పేస్టు – 1 స్పూన్, ఉప్పు – తగినంత,
పసుపు – చిటికెడు, పంచదార – 1స్పూన్,
నూనె – 2 స్పూన్లు, పుల్లటి పెరుగు – అరకప్పు, నీరు – అరకప్పు

తడ్కా కోసం

ఆవాలు – అరస్పూన్, కరివేపాకు – 5 రెమ్మలు
పచ్చిమిర్చి – 3, నూనె – 2 స్పూన్లు

తయారు చేసే విధానం

ఒక గిన్నెలో శనగపిండి, వెల్లుల్లి పచ్చిమిర్చి పేస్టు, ఉప్పు, పంచదార, నూనె వేసి కలపాలి. వాటికి పెరుగు కూడా జత చేసి బాగా కలపాలి. తర్వాత సరిపడా నీరు పోసుకుని పిండి తయారుచేసుకోవాలి. ఇప్పుడు గ్రీస్ చేసిన గిన్నెలోకి ఈ మిశ్రమాన్ని తీసుకోవాలి. దానిని ఆవిరిమీద 20 నిమిషాలు ఉడికించాలి. తర్వాత ప్యాన్‌లో నూనె పోసి కాగనివ్వాలి. అందులో ఆవాలు, కరివేపాకు, పచ్చిమిర్చి వేసి వేపాలి. ఉడికించిన ఢోక్లాని ముక్కలుగా కోసి వాటిమీద పోపు సమంగా పరిచుకునేలా వేయాలి. చివరగా వాటిమీద కొత్తిమీర, కొబ్బరి తురుము చల్లి సర్వ్ చేయాలి.



ధమ్ ఆలూ

కావలసిన పదార్థాలు

బంగాళ దుంపలు – అరకిలో (చిన్నవి) ఉడికించి పేస్టు చేసిన బంగాళ దుంపలు – 100గ్రా పన్నీర్ తురుము – 100గ్రా, కారం – 1 స్పూన్, ఉప్పు – తగినంత, గరం మసాలా – 1 స్పూన్, మెంతి ఆకు పొడి – 1 1/2 స్పూన్, నెయ్యి – 4 స్పూన్లు
వెన్న – 2 స్పూన్లు, క్రీమ్ – 2 స్పూన్లు

ఉల్లిగ్రేవీకి : ఉల్లిపాయలు – 2, గరం మసాలా – 1/2 స్పూన్. ఉప్పు – తగినంత, నెయ్యి – 1 స్పూన్

టమాట గ్రేవీకి : టమాట గుజ్జు – 200గ్రా, ఉప్పు – తగినంత, నెయ్యి – 1 స్పూన్

తయారుచేసే విధానం

ముందుగా ఉల్లిగ్రేవీ కోసం ఉల్లిపాయలు, గరంమసాలా, ఉప్పు, నెయ్యి వేసి సన్నని మంటమీద మెత్తగా ఉడికించాలి. టమాటా గ్రేవీకోసం టమాట గుజ్జు, ఉప్పు, నెయ్యి వేసి ఉడికించాలి. బంగాళదుంపలు చిన్న సైజువి తొక్కు తీసి గుండ్రంగా పై నుండి లోపలిభాగాన్ని తియ్యాలి. వాటిని కాగిన నూనెలో ఎర్రగా వేయించుకోవాలి. ఒక బౌల్‌లో బంగాళదుంప పేస్టు, పన్నీర్ తురుము కలిపి ఉంచాలి. వేగిన బంగాళదుంపల మధ్యలో పన్నీర్ మిశ్రమాన్ని కూరి ఉంచాలి. ఇప్పుడు మందపాటి ప్యాన్‌లో నెయ్యివేసి కాగనివ్వాలి. తర్వాత ఉల్లిగ్రేవీ, టమాటాగ్రేవీ వేసి నెయ్యి బయటికి వచ్చేంత వరకు సన్నని మంటమీద కలుపుతూ వేపుకోవాలి. నూనె విడిపడుతున్నప్పుడు మిగిలిన అన్ని మసాలాలూ వేసి వెన్న, క్రీమ్ కూడా కలిపి 2 నిమిషాలు ఉడికించాలి. చివరగా చిదిమిన ఆలు కూడా వేసి సిమ్‌లో కొంచెం సేపు ఉడికించి దించుకోవాలి. వేడి వేడిగా సర్వ్ చేస్తే చాలా రుచిగా ఉంటుంది.





గోబీ మంచూరియా

కావలసిన పదార్థాలు

క్యాలీఫ్లవర్ – పావుకేజీ, కోడిగుడ్డు – 1, శనగపిండి – అరకప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు – 1 స్పూన్, అజినమోటో – చిటికెడు, నూనె – వేపడానికి సరిపడా, వెల్లుల్లి ముక్కలు – పావుస్పూన్, ఉల్లిపాయ – 1, క్యాప్సికమ్ – 1

సాస్ తయారీకి : కార్న్‌ఫ్లోర్ – 3 స్పూన్లు (పావుకప్పు నీటిలో కలిపి ఉంచాలి), వెనిగర్ – 1 1/2 స్పూన్, సోయాసాస్ – 1 చెంచా, టమాట గుజ్జు– పావుస్పూన్, ఉల్లికాడల ముక్కలు – 1 1/2 సూన్, అజినమోటో – చిటికెడు, నీరు – 1 కప్పు వీటన్నింటినీ కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి.

తయారు చేసే విధానం

ఒక బౌల్‌లో క్యాలీఫ్లవర్, ఎగ్, శనగపిండి, అల్లంవెల్లుల్లి పేస్టు, అజినమోటో వేసి బాగా కలిపాలి. అందులో కొంచెం నీరు పోసుకుని ముద్దగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పావుగంట సేపు పక్కన వుంచాలి.పాన్‌లో నూనె పోసి కాగిన తర్వాత క్యాలీఫ్లవర్ మిశ్రమాన్ని కొంచెం కొంచెంగా పకోడీల్లా వేసుకోవాలి. ఒక నిమిషం సన్నని మంట మీద ఉడికించి తర్వాత మంట పెంచాలి. ఎర్రగా వేగిన తరువాత తీసి పేపర్ మీద వేయాలి(నూనె పీల్చుకోడానికి). మరో ప్యాన్‌లో 2 స్పూన్ల నూనె వేసి అందులో వెల్లుల్లి, ఉల్లిపాయ ముక్కలు వేసి వేపుకోవాలి. తర్వాత క్యాప్సికమ్ వేసి ఒక నిమిషం వేపాలి. తర్వాత సాస్ మిశ్రమం వేసి కలపాలి. సన్నని మంట మీద సాస్ గట్టిపడే వరకు ఉడికించాలి. తర్వాత వేపిన క్యాలీఫ్లవర్ బాల్స్‌ని వేసి బాగా కలిపి తీసి వేడి వేడిగా సర్వ్ చెయ్యాలి.

★



బ్రెడ్‌బాల్స్

కావలసిన పదార్థాలు

బ్రెడ్ ప్యాకెట్ – 1, బంగాళదుంపలు – 4
ఉల్లి తరుగు – అరకప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు – 1 1/2 స్పూను
పచ్చిమిర్చి పేస్టు – 1 1/2 స్పూను, పసుపు – చిటికెడు
గరం మసాలా – 1 స్పూన్, నూనె – 3 కప్పులు, ఉప్పు – సరిపడా

తయారుచేసే విధానం

బ్రెడ్ ముక్కలను నీళ్లలో తడిపి అరచేతిలో ఉంచి వత్తితే నీరంతా పోతుంది. వీటిని మిక్సీలో వేసి పేస్టు చేసుకోవాలి. బంగాళదుంపలను ఉడికించి తొక్కు తీసి కచ్చాపచ్చాగా మెదిపి ఉంచాలి. ఒక ప్యాన్‌లో 3 స్పూన్ల నూనె వేడిచేసి దాంట్లో ఉల్లి తరుగు వేసి వేపాలి. తర్వాత పచ్చిమిర్చి పేస్టు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి మరో నిమిషం వేపుకోవాలి. ఇప్పుడు బంగాళదుంపల మిశ్రమం కూడా వేసి బాగా కలపాలి. తరువాత ఉప్పు, పసుపు, గరంమసాలా కూడా వేసి కూరలో చెమ్మంతా పోయేలా వేపుకోవాలి. ఈ కూరని బాగా చల్లారనివ్వాలి. తర్వాత ఈ మిశ్రమంతో చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి. ప్యాన్‌లో 3 కప్పుల నూనె పోసి కాగనివ్వాలి. ఇప్పుడు బంగాళదుంప బాల్స్‌ని బ్రెడ్ పేస్టులో ముంచి కాగిననూనెలో వేయాలి. ఒక నిమిషం సన్నని మంటమీద ఉడికించి తర్వాత మీడియం మంటమీద ఎర్రగా వేపుకోవాలి. వాటిని సర్వింగ్ ప్లేటులో ఉంచి టమాటా సాస్‌తో వేడిగా సర్వ్ చేయాలి.

స్ఫూర్తి

ఎం.ఎ.గఫూర్,

సిపిఐఎం కేంద్రకమిటీ సభ్యులు

దేశంకోసం.... ప్రాణం తృణప్రాయం



ఇలాంటి ఎందరో యోధులు తమ బలిదానాలతో ఫాసిస్టు సేనల్ని ఓడించి సోవియట్‌ను మాత్రమే గాక ప్రపంచాన్ని కాపాడారు. ప్రజానీకం ప్రత్యేకించి ప్రతి యువకుడు చదవదగ్గ పుస్తకంగా నేను 'దిటవు గుండెలు'ను భావిస్తాను. అంతేకాదు కమ్యూనిస్టులు నిస్వార్థంగా దేశంకోసం పోరాడిన నేపథ్యం 'దిటవుగుండెలు'ది. తమ ప్రాణాన్ని తృణప్రాయంగా భావించే తత్వం నాకు నచ్చింది. ఆ రకమైన అంకితభావం, నిస్వార్థ సేవాభావం, దేశం కోసం, ప్రజల కోసం పోరాడేతత్వం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఆ ఆశయ స్ఫూర్తితోనే ఇప్పటికీ పనిచేస్తున్నాను.

సామాజిక స్పృహతో రాసిన ప్రతి పుస్తకమూ పాఠకుల చైతన్యాన్ని అభివృద్ధి చేయడమే గాక వారిలో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుంది. ఆ కోవకు చెందిన పుస్తకమే 'దిటవు గుండెలు'.

రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మన్ సేనలు సోవియట్ యూనియన్‌ను ఆక్రమిస్తాయి. ఎర్రసైన్యం వీరోచిత ప్రతిఘటన, తమ మాతృభూమి రక్షణ కోసం ప్రజలు కూడా జర్మన్ సైన్యానికి వ్యతిరేకంగా కార్యాచరణకు దిగడంతో దురాక్రమణదారులు ఊహించని ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రపంచపు మొట్టమొదటి సోషలిస్టు దేశమైన సోవియట్ రష్యాలో ఎర్రజెండా రెపరెపల్ని శాశ్వతంగా అంతం చేయాలన్నది హిట్లర్ ఆలోచన. అందుకే లక్షలకు లక్షలుగా జర్మన్ సైన్యాన్ని రంగంలోకి దించి తన లక్ష్యాన్ని సాధించాలని తహతహలాడుతూ ఉంటాడు. కానీ రష్యన్ల ప్రతిఘటన ముందు హిట్లర్ ఎత్తులు పనిచేయవు. ఆక్రమణ ప్రాంతాల్లో 'నూతన వ్యవస్థ నిర్మాణం' పేరిట జర్మన్లు సాగించే దురాగతాలకు, సామూహిక హింసాకాండకు, ఆస్తులు కొల్లగొట్టడానికి, హద్దూపద్దూ లేకుండా పోతుంది. ఈ పరిస్థితుల్లో శత్రువును వెనక నుంచి దెబ్బకొట్టడానికి మరియు ఆక్రమిత ప్రాంతాల్లో ప్రజల రక్షణ కోసం గెరిల్లా దళాలను పంపి ఫాసిస్టులతో పోరాడాలని సోవియట్ పార్టీ నిర్ణయిస్తుంది. ఎర్రసైన్యంలోని సమర్థులకు, ఎంపిక చేసిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు శిక్షణనిచ్చి గెరిల్లా దళాలను రూపొందించి శత్రు ఆక్రమిత ప్రాంతాల్లో ప్రవేశపెడతారు. ద్మిత్రీయ్ మెద్వెదేవ్ నాయకత్వంలోని దళం అలాంటి గెరిల్లా దళాల్లో ఒకటి. ఉక్రెయిన్ ప్రాంతంలో 1942 నుంచి 1945 వరకూ ఈ గెరిల్లా దళం జరిపిన వీరోచిత, సాహసోపేత కార్యకలాపాల సమాహారమే 'దిటవు గుండెలు'. ఇది నవలగా కనపడినా నవల కాదు. ఇది పెద్ద కథగా ఉన్నా కథ కాదు. యదార్థ ఘటనల వాస్తవ చిత్రీకరణే ఈ పుస్తకం రూపం.

***

మా కుటుంబం రాజకీయాలతో సంబంధం లేని కుటుంబం. పేద రైతుగా మా నాన్నగారు అతి కష్టంమీద నన్ను మాత్రమే చదివించగలిగారు. జిల్లాలో బాగా వెనుకబడిన ప్రాంతంగావున్న బనగానపల్లె మండలంలోని హుస్సేనాపురం మా స్వగ్రామం. చిన్నతనంలో బనగానపల్లె లైబ్రరీలో పుస్తకాలు చదివే అలవాటు ఉన్నది. అయితే అభ్యుదయ సాహిత్యం కాకుండా కథలు, నవలలు మాత్రమే అందుబాటులో ఉండేవి. అని రెగ్యులర్‌గా చదివేవాణ్ణి.

నేను ఇంటర్‌మీడియట్ చదవడానికి కర్నూలులోని ఉస్మానియా కాలేజీలో చేరాను. మా సీనియర్లు కొందరు వచ్చి ఎస్ఎఫ్ఐలో పనిచేయడానికి ఆహ్వానించారు. ఎస్ఎఫ్ఐ ఆశయాలు, పని నచ్చి నేను ఎస్ఎఫ్ఐలో చురుగ్గా పాల్గొనేవాణ్ణి. కర్నూలు ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఒక చిన్న లైబ్రరీ నిర్వహించేవారు. అక్కడ అభ్యుదయ పుస్తకాలు, జీవిత చరిత్రలు ఉండేవి. కొత్తగా కార్యకర్తలుగా పనిచేస్తున్న విద్యార్థులతో ఈ పుస్తకాలు చదివించే కృషి జరిగేది. ఆ క్రమంలోనే దిటవు గుండెలు చదివాను. అలా ఇంటర్ చదివే రోజుల్లో రష్యా, చైనా, వియత్నాం దేశాల విప్లవ గాథల్ని వరుసగా చదివేవాణ్ని. వియత్నాంలో అప్పటికీ గెరిల్లా పోరాటం జరుగుతూ ఉండింది. చైనాలో విప్లవ ప్రభుత్వ విజయాలు ఉత్సాహాన్నిచ్చేవి. ప్రపంచానికి మరో కొత్త

ప్రపంచాన్ని చాటిన సోవియట్ పట్ల ఆరాధ్యభావం వుంది. ఆ క్రమంలోనే 'దిటవు గుండెలు'ను చదివాను. నాపై ఈ పుస్తకం చూపిన ప్రభావం ఇప్పటికీ స్పష్టంగా జ్ఞాపకం ఉంది. ప్రపంచాన్ని గడగడలాడించిన ఫాసిస్టు సేనలపై గెరిల్లా యోధులు ప్రాణాలకు తెగించి పోరాడిన తీరు ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది. అయితే గెరిల్లా యోధుడు ఫెదయేన్ తన మృత్యుమొహంలో ఉండి కూడా 'బ్రతికితే' తనను కమ్యూనిస్టు పార్టీ క్యాండిడేట్ సభ్యత్వానికి సిఫార్సు చేయమని కమాండర్‌ను అడిగే తీరు కమ్యూనిస్టు పార్టీ ప్రతి సభ్యుడు గర్వించే సందర్భం అని నేను భావిస్తాను. అది కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వానికి ఉన్న గొప్పతనం అని నాకు అనిపించింది. నేను ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోనే కమ్యూనిస్టు పార్టీ(మార్కిస్టు) సభ్యునిగా చేరడానికి కూడా ఇదే ప్రేరణ.

***

ఆ పుస్తకంలో అందరూ హీరోలే. ఎవరి పాత్ర వారు నిర్వహించారు. మెద్వెదేవ్, కుచేత్కోవ్, కుజ్నెత్సోవ్, షెమ్యూనోవ్, ఫెదయేవ్, షఫూన్, లుకేన్, సేమ్యొనోవ్, ప్రిహద్కో, డాక్టర్ తెత్సార్ స్కయ్ ఒకరేమిటి ఇలా ఒక్కొక్కరు ఒక గొప్ప దేశభక్తుడు. ఒక్కొక్కరు ఒక సాహసయోధుడు. ఏ క్షణంలోనైనా తాము పోరాటంలో శత్రువుకు బలిగావచ్చని తెలిసినా నిర్భయంగా వారు శత్రువులతో తలపడిన తీరు, సంతోషంగా మాతృదేశ విముక్తికై ప్రాణాలు అర్పించిన తీరు ప్రతి దేశభక్తుని గుండెలు ఉప్పొంగేలా చేస్తుంది. ప్రజల్లో నుంచి గెరిల్లాలుగా చేరిన నికోలాయ్ స్ర్కూ తిన్స్కయ్, అతని కుటుంబ సభ్యులందరి త్యాగాలు అనన్య సామాన్యమైనవి. అందులో ప్రత్యేకించి అతని భార్య మార్ఫా అతి రహస్యమైన గెరిల్లా కార్యక్రమంలో పాల్గొంటూ ప్రాణ త్యాగం చేయాల్సి రావడం, కుమారుడు జార్జ్ శత్రువుకు చిక్కి చిత్రహింసల పాలుకావడం పాఠకుల గుండెల నుంచి కన్నీరు ద్రవింపజేస్తుంది. చిన్నారులు కోల్యా, వోలోద్యాలు అతి చిన్న వయస్సులో గెరిల్లా దళాల్లో చేరి చేసే కార్యకలాపాలు ప్రతి ఒక్కరినీ అబ్బురపరుస్తాయి. కాత్యా, వాస్య, మారుస్య, వోల్యా లాంటి యువతుల త్యాగాలు తాము దేశ రక్షణలో ఎవరికీ తీసిపోమని మహిళలు గర్వించేలా ఉంటాయి.

సంఖ్యలో చాలా పరిమితంగా ఉంటూ, జర్మనీ సైన్యంతో పోలిస్తే సాంకేతికంగా చాలా బలహీనంగా ఉన్న స్థితిలో కూడా గెరిల్లా యోధులు శత్రువుతో తలపడడమే గాకుండా 'హుర్రా' శబ్దం చేస్తూ విరుచుకుపడడం, నలువైపుల నుంచి శత్రువుపై దాడులు చేస్తూ వారిని సామూహికంగా వధించడం రైల్వేలైన్లను పేల్చి వేస్తూ జర్మన్ సైన్యం కదలికలను కట్టడి చేస్తూ వారి ఫ్రంట్ లైన్‌కు సరఫరాలు పోకుండా అడ్డుకోవడం, ప్రజలపై దారుణాలకు, హింసకు బాధ్యులైన 'మృత్యురాజు' లను అక్కడికక్కడే వధించడం, ప్రజలను ఉత్సాహపరిచి వారిలో నుంచి గెరిల్లాలను రిక్రూట్ చేసుకోవడం ప్రతిదీ అత్యద్భుతంగా చిత్రీకరించడం జరిగింది.

గెరిల్లా యోధుడు కుజ్నెత్సోవ్‌కు జర్మన్ భాష వచ్చు. దీన్ని అవకాశంగా చేసుకుని అతనికి జర్మన్ సైనిక ఆఫీసర్‌గా వేషం మార్చి రోవ్నో నగరంలో ప్రవేశపెట్టడం జరుగుతుంది. దుర్భేద్యమైన శత్రు దుర్గాల్లోకి అతను చొచ్చుకుపోతాడు. శత్రువు కదలికలు ఎప్పటికప్పుడు దళానికి అందిస్తూ ఉండడమే గాకుండా అత్యున్నతస్థాయి జర్మన్ సైనిక అధికారులను రోవ్నో నగరం వీధుల్లోనే హతమార్చి జర్మన్ సైన్యం గుండెల్లో గుబులు పుట్టిస్తాడు. కుజ్నెత్సోవ్ సాహస కృత్యాలు యువతకు ఆదర్శప్రాయాలు. అసాధ్యమనుకున్న అనేక కార్యక్రమాలు అమలు చేస్తాడు. తను మరో ముఖ్యమైన బాధ్యత అమలు చేయడానికి పోతున్న సందర్భంలో నాకేమైనా జరిగితే ఆ తర్వాతనే చదవాలనే షరతుతో ఒక లేఖను గెరిల్లా కమాండర్‌కు అందిస్తాడు. ఆ కర్తవ్య నిర్వహణలో ఆ కామ్రేడ్ తన ప్రాణాల్ని కోల్పోతాడు. ఆ లేఖలోని కొన్ని వాక్యాలు ఇప్పటికీ గుర్తే.

'జీవితం అంటే నాకు ఎంతో ప్రేమ. నేనింకా యువకుణ్ణే. కానీ కన్న తల్లిని ప్రేమించినట్టుగా నేను ప్రేమించే నా దేశం కోసం నా జీవితాన్ని త్యాగం చేయడం అవసరమైన పక్షంలో అందుకు నేను సిద్ధమే. సూర్యుణ్ణి రూపుమాపడం ఎంత అసాధ్యమో ప్రజలను లొంగదీసుకోవడం అంతే అసాధ్యం. అని వారు తెలుసుకొందురు గాక'.

ఇలాంటి ఎందరో యోధులు తమ బలిదానాలతో ఫాసిస్టు సేనల్ని ఓడించి సోవియట్‌ను మాత్రమే గాక ప్రపంచాన్ని కాపాడారు. ప్రజానీకం ప్రత్యేకించి ప్రతి యువకుడు చదవదగ్గ పుస్తకంగా నేను 'దిటవు గుండెలు'ను భావిస్తాను. అంతేకాదు కమ్యూనిస్టులు నిస్వార్థంగా దేశంకోసం పోరాడిన నేపథ్యం 'దిటవుగుండెలు'ది. తమ ప్రాణాన్ని తృణప్రాయంగా భావించే తత్వం నాకు నచ్చింది. ఆ రకమైన అంకితభావం, నిస్వార్థ సేవాభావం, దేశం కోసం, ప్రజల కోసం పోరాడేతత్వం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఆ ఆశయ స్ఫూర్తితోనే ఇప్పటికీ పనిచేస్తున్నాను.

★

ఆ క్రమంలోనే 'దిటవు గుండెలు'ను చదివాను. నాపై ఈ పుస్తకం చూపిన ప్రభావం ఇప్పటికీ స్పష్టంగా జ్ఞాపకం ఉంది. ప్రపంచాన్ని గడగడలాడించిన ఫాసిస్టు సేనలపై గెరిల్లా యోధులు ప్రాణాలకు తెగించి పోరాడిన తీరు ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది. అయితే గెరిల్లా యోధుడు ఫెదయేన్ తన మృత్యుమొహంలో ఉండి కూడా 'బ్రతికితే' తనను కమ్యూనిస్టు పార్టీ క్యాండిడేట్ సభ్యత్వానికి సిఫార్సు చేయమని కమాండర్‌ను అడిగే తీరు కమ్యూనిస్టు పార్టీ ప్రతి సభ్యుడు గర్వించే సందర్భం అని నేను భావిస్తాను. అది కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వానికి ఉన్న గొప్పతనం అని నాకు అనిపించింది. నేను ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోనే కమ్యూనిస్టు పార్టీ(మార్కిస్టు) సభ్యునిగా చేరడానికి కూడా ఇదే ప్రేరణ.



కవిత్వం

చదువుల బొకే

వాడు నా మేనల్లుడు
వాడి లేత తమలపాకు పాదముద్రల్ని
ఈ మధ్యే ఎల్‌కేజీ చదువుల మెట్ల మీద వేయించడం మొదలెట్టాం

మొగ్గల్లా విచ్చుకుంటున్న పసితనపు లాలిత్యాన్ని
ప్లాస్టిక్ కవర్‌తో కప్పేసి
చదువుల బొకే చేసినట్టు
వాణ్ణి స్కూలు యూనిఫామ్‌తో అందంగా ముస్తాబు చేసి పంపుతున్నాం

పుస్తకాల బరువుతో
వాడు రోజూ కాన్వెంట్ కెళ్తుంటే
యుద్ధానికెళ్తున్న సైనికుడల్లే వాడు దృశ్యమవుతుంటాడు

మారాం వాడి లేత బుగ్గల మీద చారల్లా నిలుస్తుంటే
బైకో/ కారో ఆశ చూపిస్తే చాలు
వాడు సంతోష పల్లకీయై స్కూలు సవారీ చేసేస్తుంటాడు

వాడి ఏసి క్లాసురూముల
కూలింగ్ చదువుల పాఠాలు
వాణ్ణి ఫ్రిజ్‌లోని తాజాపళ్లల్లే ఉంచుతుంటే
వాడి చదువుల నాజూకుతనం ప్రోగ్రెస్ రిపోర్టుల్లో
వెతుక్కోవలసిందే



వాడి ముద్దు ముద్దు మాటల్ని
రైములుగా తర్జుమా చేస్తుంటే
మేమంతా సంతోష పందిళ్లమే సుమీ

లోకంలో ఏం జరుగుతుందో తెలీనితనంలో
వాడి ఉదయాస్తమయాలు కేజీ చదువుల్లో
పొద్దుపుచ్చుకుంటుంటే
ఇంటికి వచ్చీ రావడంతోనే
నిద్రాజోలకి అమాంతం మూతపడే వాడి కిటకిట తలుపుల్ని
బలవంతంగా తెరిపిస్తూ
హోంవర్క్ కుర్చీకి వాణ్ణి కట్టేస్తుంటే

చదువుల ప్రస్థానంలో
టాటాలకీ... బైబైలకీ మధ్య వాడు
పూర్తికాని స్టడీ అవర్‌లా... కళ్లు నులుముకుంటూ
మిగిలిపోతున్నాడు

- దాకారపు బాబూరావు

నీరైపోనూ....!

జొన్నసేను రేకుల్లో
మబ్బుకళ్లు జార్చిన
పన్నీరే ఈ చిట్టి చినుకులు
పూవైపోదూ చిరునవ్వైపోదూ
ఊరించే జొన్న పొత్తైపోదూ

చెరుకు గడల మధ్య
నిద్రను ఆరేసుకుంటే
తడిచినుకు గుండెను హత్తుకుంది
ప్రియురాలిలా!

చూపులు పెనవేసుకున్నట్లు
చినుకులు అల్లుకుపోతున్నాయి

వాన
ధూళి తెరలు తీసి
అద్దంలాంటి
అరిటాకు వనాల్ని ప్రసాదించింది

చినుకు విరిస్తే
కడిగేది హృదయాల్నీ సమస్త జీవరాశుల్నీ
జలాశయాల్నీ....

వాన తాకితే చాలు
బరువు మనిషి తేలికైనట్లు
తేలిక మనిషి బరువౌతున్నట్లు
అంతర్గత సంద్రాలు
ఆహ్లాద కెరటాల్తో
తడిగాలులు వీస్తాయి

నీరు తగిలితే చాలు
మొలకెత్తుతాం
వట వృక్షమౌతాం

గూళ్లు కట్టిన మబ్బులకి
చల్లని గాలులు
కొంగులతో ఊయలలూపుతాయి
గాలి వీస్తే
వాన లేస్తే
ప్రాణాలు ముద్దవుతుంటాయి

ఆకాశానికి
రెక్కలుచాచి
బొంగరంలా
గిరికీలు కొడుతుంటే
సౌందర్యం శరీరమైనట్లు
మనసు పల్లకిలో
తేలియాడుతుంది

నేనుండగలనా
చినుకుల్ని ఛేదించగలనా
దోసిళ్లలోంచి రాలే
చినుకుల్లా
ఒక్క ధారగా
నీరైపోనూ....!

-గడివి శ్రీనివాస్

నవ్వుల్ - పువ్వుల్

ఇద్దరా!



వనజ: ఏమిటి పిన్ని గారు! ఈ రోజంతా కోపంగా వున్నారు?

సరోజ: ఆ... ఏమీ లేదు. బరువు మిషన్ ఎక్కి రూపాయి వేస్తే ఒకేసారి ఇద్దరు ఎక్కకూడదని వచ్చింది.

స్వయంగా...

అమ్మ: నేను చెప్పినట్లే మీ ఆయనతో ఇంటిపని, వంటపని చేయిస్తున్నావా? ఇప్పుడెలా వుంది నీ జీవితం?

కూతురు: అదే నా కొంప ముంచిందమ్మా. ఇప్పుడాయన అన్ని పనులు స్వయంగా చేసుకోగలుగుతున్నారట. విడాకులిస్తే తన పని తాను చేసుకుంటారట.

ధైర్యం

ధీరజ్: మా నాన్నకు బంగారపు పళ్లున్నాయి. అందుకని రోజూ తలను ఇనప్పెట్టెలో పెట్టుకుని పడుకుంటాడు.

సూరజ్: ఎందుకలా! మా నాన్న చూడు బోల్డంత డబ్బు బ్యాగ్గుల్లో పెట్టుకుని ధైర్యంగా తిరుగుతుంటాడు.

ధీరజ్: మీ నాన్న ఏం చేస్తుంటాడు?

సూరజ్: బస్ కండక్టర్.

అంతస్తులు

రవి: జీవితంలో ఈ కష్టాలను ఇక భరించలేను. 8వ అంతస్తు నుండి దూకి చావాలనుకుంటున్నాను.

శంకర్: కానీ మన ఊర్లో 8 అంతస్తుల భవనం లేదు. 4 అంతస్తుల వరకే ఉందికదా.

రవి: అలాంటప్పుడు దానిమీద నుండే రెండుసార్లు దూకి ఆత్మహత్య చేసుకుంటాను.

ట్రాఫిక్ పోలీస్

టీచర్: చిన్నప్పుడు క్లాస్‌లో ఎప్పుడూ అల్లరి చేస్తే మీ పెద్దోడిని బెంచి మీద నిలబెట్టేవాణ్ణి. ఇంతకీ ఇప్పుడేం చేస్తున్నాడు.

తండ్రి: మీ దయవల్ల వాడికి ట్రాఫిక్ పోలీస్ వుద్యోగం వచ్చింది.

బిజీ

ప్రభావతి: ఇంట్లో ఎవరూ లేరేంటి? అందరూ ఎక్కడికి వెళ్లారొదినా?

సూర్యావతి: మామయ్యగారు వీధిలో బుర్రకథ వినడానికి, మావారు పక్క వీధిలో హరికథ వినడానికి, మా అబ్బాయి ప్రేమ కథ సిన్మా చూడ్డానికి వెళ్లారు. నేనేమో టీవీలో తరగని కథ సీరియల్ చూస్తున్నానొదినా.

గొప్పలు

భార్య: నేను జడ్జిగారబ్బాయిని చేసుకున్నా బాగుండేది. మీరూ ఉన్నారు ఎందుకు? మా అమ్మ ఇంటి అద్దె ఇస్తుంది. మా నాన్న తిండికిస్తారు. మా అన్నయ్య మన పిల్లల్ని చదివిస్తాడు. మా పెద్ద మామయ్య మనకి, మన పిల్లలకు బట్టలకి డబ్బులిస్తాడు.

భర్త: ఊరికే గొప్పలు చెప్పకోకు. నీకింకో ఇద్దరు మామయ్యలు, ముగ్గురు బాబాయిలున్నారు. వాళ్లెప్పుడయినా దమ్మిడీ విదిల్చారా?

సెల్ నెంబర్

మొదటి వ్యక్తి: మీ సెల్ నెంబర్ చెప్పండి.

రెండవ వ్యక్తి: చెర్లపల్లిలో 420, విశాఖలో 210, రాజమండ్రిలో 110.

ఎమ్.ఎల్.నారాయణ

కథ

అమృత బిందువులు

- పొత్తూరి విజయలక్ష్మి

తూరుపు తెలతెలవారుతుండగా చంద్రహాస్ బయలుదేరిన కారు ఊరి పొలిమేరలోకి అడుగుపెట్టింది. ఈతచెట్లు, తాటితోపులు దాటి చెరువు గట్టుపై పరిగెత్తుతున్న కారులోంచి బయటికి చూస్తున్న చంద్రహాస్‌కి తన బాల్యం గుర్తుకురావడంతో మనసు ఆనందంతో దూదిపింజల్లా గాలిలో తేలిపోతున్నది.

“ఆనందీ! అటు చూడు నేను కూడా వాళ్ళలాగే ఈ చెరువులో ఈత కొట్టేవాణ్ణి. ఒకసారి ఏమైందో తెలుసా? నా స్నేహితులతో బడెగ్గొట్టి కోతికొమ్మచ్చి ఆడుతుంటే ఎలా తెలిసిందో మా అమ్మకి? చింత బరికతో ప్రత్యక్షమైంది. అది గమనించిన నేను ఆట మధ్యలోనే ఆపేసి పరుగు, రెండు నిమిషాల్లో ఇంటికి చేరాను తెలుసా!” అంటూ నవ్వాడు. ఆనంది కూడా చంద్రహాస్‌తో నవ్వులో పాలుపంచుకుంది.

కారు పంచాయతీ ఆఫీసు ముందున్న ఇంటి ముందు ఆగింది. సామానంతా దించుకుని, కారును పంపేసి, ఆనందితో ఇంట్లోకడుగు పెట్టబోయాడు చంద్రహాస్.

“ఆగండాగండి! దేశదేశాలు తిరిగొచ్చారు. ఎంతమంది కళ్ళు మీ మీద పడ్డాయో ఏమో? అంటూ లోపలికెళ్ళి పళ్లెంలో ఎర్ర నీళ్ళు తీసుకొచ్చి వాళ్ళ చుట్టూ తిప్పి “మీరు కాళ్ళు కడుక్కుని లోపలికెళ్ళండి” అంటూ పళ్లెంలోని నీళ్లను నడి రోడ్డులో కుమ్మరించింది సావిత్రమ్మ.

“అదేంటమ్మా నీ ఛాదస్తం ఇంకా తగ్గినట్లు లేదే. ఆ ఎర్ర నీళ్లేంటి? మా చుట్టూ తిప్పడమేంటి? నాకివన్నీ నచ్చవని నీకు తెలుసు కదా? ఎందుకలా చేస్తావ్?...”

“చాల్లే! ఊరుకోరా! నువ్వు డాక్టరు చదివి ఇన్నేళ్ల తరువాత ఊళ్లో అడుగుపెట్టావ్. అందరి చూపులూ నీ మీదే.

“డాక్టర్ చదివింది నేనొక్కణ్ణే కాదమ్మా? ప్రపంచంలో నాలాంటి వాళ్ళు చాలా మందే ఉన్నారు”

“చాల్లే ఊరుకో? చదువుకున్నంత మాత్రాన మన ఆచారాలను వదులుకోనక్కరలేదు” అంది సావిత్రమ్మ.

“ఇది ఆచారం కాదు. మూఢ నమ్మకం” అని విసుక్కున్నాడు హాస్.

“పోనీలే ఊరుకోండి. పెద్దవాళ్ల మనసెందుకు కష్టపెట్టడం” అంటూ అత్తగారికి వత్తాసు పలికింది ఆనంది.

సాయంకాలం ఆరుబయట కూర్చొని ఆనంది, హాస్‌లు కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంటిముందున్న రావిచెట్టుపై కిలకిల రావాలతో పక్షులన్నీ గూళ్లకు చేరుతున్నాయి. చూడముచ్చటగా ఉన్న ఆ దృశ్యాన్ని కెమెరాలో బంధించింది ఆనంది. ఇంతలో ఉప్పు, కారం కలిపిన జొన్న పేలాలు ప్లేటులో తెచ్చి వాళ్ల ముందుంచింది సావిత్రమ్మ. అత్తగారి ఆప్యాయత, ఆ ఊరి వాతావరణం ఎంతగానో నచ్చాయి ఆనందికి.

“సావిత్రమ్మ గారూ! ఓ సావిత్రమ్మగారూ”..

“ఏంటిరా! పొద్దున్నే ఆ పొలికేకలు?”

“గొడ్లపాకలో గుడ్లగూబ దూరింది. దాన్నెళ్లగొట్టడానికందరూ విశ్వప్రయత్నం చేస్తున్నారు” అన్నాడు గుర్నాథం. “అరెరె! ఎంతపని జరిగింది? తొందర తొందరగా ఆ పాకలో ఉన్న గొడ్లన్నిటినీ బయట కట్టెయ్యండిరా!” అంటూ హడావిడి చేస్తున్నది సావిత్రమ్మ.

ఆ కేకలకు నిద్రలేచి బయటికొచ్చిన ఆనంది, చంద్రహాస్‌లు విషయాన్ని తెలుసుకుని

“ఎందుకమ్మా! అంత గందరగోళం చేస్తున్నారు? అది కూడా పక్షే కదా! జరగరానిదేదో జరిగినట్లు ఒకటే హంగామా. నిన్న మొన్నటి దాకా అక్కడున్న చెట్టుమీద దాని నివాసముండేది. దాన్ని కాస్తా కొట్టేశారు. పాపం అదేం చేస్తుంది? పాకలో తలదాచుకుంది. అదిప్పుడు నీకేం అడ్డం వచ్చింది? ఉండనివ్వొచ్చు కదా!” అన్నాడు చంద్రహాస్.

“ఏంటిరా ఉండనిచ్చేది! ఇప్పుడు ఆర్నెల్లపాటు ఆ పాకని పాడుబెట్టాలి, శాంతి చేయించాలి. ఈ గొడ్లనన్నిటినీ ఎక్కడ కట్టెయ్యాలో ఏమో! గుర్నాథం! ముందు వీటిని మీ ఇంటిదగ్గర కట్టెయ్యి. తరువాత సంగతి తరువాత చూసుకుందాం” అంది సావిత్రమ్మ.

“ఆనందీ! ఈ గోలలన్నీ మాకు మామూలే గానీ సాయంకాలం అలా బయటికెళ్దాం. ఊరు చూద్దువుగాని” అన్నాడు హాస్.

మొదటగా రామాలయానికెళ్లారు. ఆ గుడి గురించి చెప్తూ పూజారి పెట్టే పొంగలి ప్రసాదం కోసం తాను ఎన్ని పాట్లు పడేవాడో చెప్పాడు నవ్వుకుంటూ. ఇద్దరూ చెరువు గట్టుకు చేరారు. గట్టుకు ఒక పక్కగా కూర్చోవడానికి అనువుగా తాటి బోదెలు వేసి ఉన్నాయి. పండువెన్నెల, చల్లటిగాలి, పిల్లల ఆటలు, కేరింతలు చూస్తూ తనను తానే మరిచిపోయింది ఆనంది.

“నాదో చిన్న కోరిక హాస్”

ఏంటో చెప్పు అన్నట్టుగా చూశాడు హాస్.

“ఈ ఊరు నాకు చాలా నచ్చింది. ఇక్కడే ఉండిపోదాం. మీ హాస్పటల్‌కు ఇక్కడే ఏదైనా ఏర్పాటు చేసుకోండి” అంది గోముగా చంద్రహాస్‌ని బతిమాలుతున్నట్లు.

సరేనన్నట్లు తలూపాడు హాస్.

“ఇంట్లోకొస్తూనే కాళ్లు కడుక్కుంటూ “అమ్మా! బాగా ఆకలిగా ఉంది అన్నం వడ్డించు” అన్నాడు హాస్.

“ఆ ..సరే.. అంటూ రెండు పిడికిళ్లలో ఉప్పు ఎండుమిరపకాయలు తెచ్చి “ఇరుగుదిష్టి, పొరుగుదిష్టి... అంటూ గబాగబా మూడుసార్లు వాళ్ల చుట్టూ తిప్పి వాటిని రోడ్డుమీదకు గిరాటేసి ఇక మీ దిష్టి పోయినట్లే అన్నానికి రండి” అంది సావిత్రమ్మ.

అన్నం కలుపుకుంటూ “అమ్మా నేనీ ఊళ్లోనే ఉండిపోవాలనుకుంటున్నా” అన్నాడు హాస్.

“సంతోషం బాబు. మనది లంకంత కొంప. మనింట్లోనే హాస్పటల్ పెట్టుకోవచ్చు” అంది సావిత్రమ్మ.

“మనింట్లో కాదు”

“మరి”

“ఎదురుగానున్న గొడ్లపాక తీసేసి మల్టీస్పెషాలిటీ హాస్పటల్ కట్టించాలనుకుంటున్నా”

“అయ్యో! అయ్యో! అదేం ఆలోచనరా మొన్నీమధ్యనే గదరా! జరగరాని ఘోరం జరిగింది. దాని తరువాత కనీసం ఆర్నెళ్లైనా ఆగాలి గదరా!”

“ఆర్నెల్లు కాదు. ఆరు రోజులు కూడా ఆగను”

“అసలే ఇవి మంచి రోజులు కావు” అని మళ్లీ గొణిగింది సావిత్రమ్మ.

“మంచి పని చేయడానికి అన్ని రోజులూ మంచివే. తెలిసిందా. నా నిర్ణయం మారదు. రేపే శంకుస్థాపన” అన్నాడు చంద్రహాస్.

శంకుస్థాపన కార్యక్రమం జరుగుతున్నది. ఊరిపెద్ద కృష్ణమూర్తి గారింకా రాలేదు. గుంపులో నుండెవరో అంటున్నారు.

“వాళ్లమ్మాయి బడికెళ్లొస్తూ దిష్టి తీసి పోసినవేవో తొక్కిందట. ఒళ్లు తెలియని జ్వరమంట. పక్కూళ్లోకి ఎవరో స్వామీజీ వచ్చాడని ఆ అమ్మాయిని అక్కడికి తీసుకెళ్లాట్ట”.

ఆ మాటలు చంద్రహాస్ చెవిన పడ్డాయి. అమ్మలాంటివాళ్లు ఈ ఊళ్లో చాలామందే ఉన్నారన్నమాట. ఈ మూఢులను మార్చడానికయినా ఇక్కడ సరైన వైద్య సదుపాయాలను కల్పించాలి. మంత్రాలకు చింతకాయలు రాలవని వీళ్లు గ్రహించే రోజు రావాలని మనసులో అనుకున్నాడు హాస్. తాను చేసే ప్రయత్నం గురించి తన స్నేహితులతో సంప్రదించాడు హాస్. వాళ్లందరూ.

“ఈ విషయంలో నీవు వేసే ప్రతి అడుగుకీ మా సహకారం ఉంటుంది” అని హామీ ఇచ్చారు. హాస్పటల్ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి.

“ఆ సావిత్రమ్మ కొడుకు చేస్తున్న పని బాగానే ఉంది. కానీ పోయిపోయి ఆ స్థలంలో కట్టించడమేంటి?”

“ఆ గుడ్లగూ... ”

“ఆ... ఆ... ఆగాగు ఈ చీకటివేళ దానిపేరు కూడా తలవకూడదు. ”

“ఆ... ఏదోలే అది చేరిన స్థలాన్ని అసలు పాడుబెట్టించాలి. ఈయనేమో ఆ స్థలంలోనే ఇంత పెద్ద హాస్పటల్ కడుతున్నాడు. ఇక వైద్యం కోసం అక్కడికెళ్లిన వాళ్లు బతికేంబట్టకడతారు? నలుగురు చేరితే చాలు ఇటువంటి మాటలే ఊరివాళ్ల మధ్యన జరుగుతున్నాయి.”

ఆ రోజు జరగబోయే హాస్పటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తహసీల్దారు తన అనుచరులతో అరగంట ముందే చేరుకున్నాడు. ఆనంది, హాసులు తెగ హడావిడి పడిపోతున్నారు. విక్రమ్, వినీత్, చంద్రికలు కూడా హాస్‌కి తోడుగా ఉన్నారు.

“గుర్నాథం! ముహూర్త సమయం దగ్గర పడుతున్నది. అమ్మను త్వరగా రమ్మను” అన్నాడు హాస్.

“సావిత్రమ్మ గారూ! బాబు మిమ్మల్ని తొందరగా రమ్మంటున్నారమ్మా” అన్నాడు గుర్నాథం.

“ఈ పాల గిన్నె లోపల పెట్టొస్తాలే. నువ్వెళ్లు” అంది సావిత్రమ్మ.

ఎదురు చూస్తున్న ప్రారంభోత్సవ సమయం రానే వచ్చింది. సావిత్రమ్మ అక్కడ లేదు. అమ్మ ఎప్పుడూ ఇంతే ఇంట్లో ఏం చేస్తున్నదో ఏమో? అని అనుకుంటున్న హాస్ కళ్లు అమ్మ కోసం వెదికాయి. ఆ దరిదాపులో అమ్మ కనిపించలేదు. ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తయింది. హాస్ చేస్తున్న ఈ మహత్తర కార్యాన్ని అందరూ అభినందించారు. ఊరు ఊరంతా హాస్పటల్ ముందు చేరారు. అక్కడ పెద్ద తిరునాళ్ళలా కోలాహలంగా ఉంది.

“కృష్ణమూర్తి గారూ! మీరేమనుకోనంటే మిమ్మల్నొకటి అడగాలనుకుంటున్నాను.

“అయ్యో అదేంటి! అడగండి బాబూ”

“మీ అమ్మాయి ఏదో అనారోగ్యంతో బాధపడుతున్నదని విన్నాను. మీరు సరేనంటే...

“ఏమో! బాబూ! మేమైతే తిరగని చోటులేదు. మంత్రాలని, దేవుళ్లని, పసర్లని ఎన్నో వైద్యాలు చేయించాం. కానీ ఫలితం ఏమీలేదు. దాన్ని మంచంలో అలా చూస్తుంటే” అంటూ భుజం మీది కండువాతో కళ్లు తుడుచుకున్నాడు కృష్ణమూర్తి.

“మీరలా అధైర్యపడకండి. నేనున్నాను. అమ్మాయిని మామూలు మనిషిని చేయడానికి ప్రయత్నిస్తాను” అన్నాడు హాస్.

శంకుస్థాపన కార్యక్రమం జరుగుతున్నది. ఊరిపెద్ద కృష్ణమూర్తి గారింకా రాలేదు. గుంపులో నుండెవరో అంటున్నారు. “వాళ్లమ్మాయి బడికెళ్లొస్తూ దిష్టి తీసి పోసినవేవో తొక్కిందట. ఒళ్లు తెలియని జ్వరమంట. పక్కూళ్లోకి ఎవరో స్వామీజీ వచ్చాడని ఆ అమ్మాయిని అక్కడికి తీసుకెళ్లాట్ట”.
ఆ మాటలు చంద్రహాస్ చెవిన పడ్డాయి. అమ్మలాంటివాళ్లు ఈ ఊళ్లో చాలామందే ఉన్నారన్నమాట. ఈ మూఢులను మార్చడానికయినా ఇక్కడ సరైన వైద్య సదుపాయాలను కల్పించాలి. మంత్రాలకు చింతకాయలు రాలవని వీళ్లు గ్రహించే రోజు రావాలని మనసులో అనుకున్నాడు హాస్. తాను చేసే ప్రయత్నం గురించి తన స్నేహితులతో సంప్రదించాడు హాస్.

“బాబు గారూ!... బాబు గారూ! తొందరగా రండీ...” అంటూ పెద్ద కేక.

అందరూ అటువైపుగా పరిగెత్తారు. సావిత్రమ్మ మెట్ల మీద పడిపోయి ఉంది. తల గుమ్మానికి తగిలిందేమో రక్తం కారుతున్నది. పిలిచినా పలికే స్థితిలో లేదు. వెంటనే తల్లిని హాస్పటల్‌కి చేర్చి వైద్యం అందించాడు హాస్. గండం గడిచి అరగంటలో మామూలైన సావిత్రమ్మ పక్కన కూర్చున్నాడు హాస్.

“అమ్మా! ఇప్పుడెలా ఉంది”

“బాబూ! ఒక చిన్న తప్పు చేశాను” అన్నాడు గుర్నాథం.

“ఏంటది?” అన్నాడు హాస్.

“ఇందాక అమ్మగారిక్కడికి ఎందుకు రాలేదా అనుకుంటూ చూద్దామని ఇంటిదాకా వెళ్లాను. ఆమెగారు కిందపడిపోయి ‘దాహం దాహం’ అంటున్నారు. నాకు కాళ్లూ చేతులు ఆడలేదు. పాపమో పుణ్యమో నాకు తెలియదుగానీ ఆ పక్కనున్న బిందెలోనుండి నీళ్లు కొంచెం అమ్మగారి గొంతులో పోసి, మీకోసం వచ్చాను” అన్నాను గుర్నాథం.

“అందులో తప్పేముంది? దీన్నే మానవత్వం అంటారు”.

“ఏమో బాబూ! అంత పెద్ద పెద్ద మాటలు నాకు తెలియదు గానీ ఆమె గారికీ విషయం తెలిస్తే....”

“చూశావా అమ్మా! గుర్నాథం నీకు ప్రాణభిక్ష పెట్టాడు. ఆ సమయంలో అలా జరిగుండకపోతే పరిస్థితి వేరే విధంగా ఉండేది. కాలం మారిందమ్మా! కాలంతో పాటు మనమూ మారాలి. సాటి వాడిని మనతో సమానంగా చూసే అలవాటు చేసుకోవాలి. మనం బాగుండాలి. ఎదుటివాడు ఏమయితేనేం అనే ధోరణికి స్వస్తి చెప్పాలి” అని అంటున్న హాస్ మాటలు సావిత్రమ్మ చెవికి అమృత బిందువులుగా చల్లగా తాకాయి.

★

'సదాజప' హాస్యరసస్రష్ట పద్మనాభం

పద్మనాభం! తెలుగు తెర హాస్య నటశ్రేణిలో అగ్రగణ్యుడు. రెండు మూడు దశాబ్దాల పాటు ప్రేక్షక జనాన్ని నవ్వుల జల్లుల్లో తడిపిన నట ప్రముఖుడు. అనేకానేక చిత్రాలు నిర్మించి విజయాలూ ప్రశంసలూ పొందిన విలక్షణ కళాభిజ్ఞుడు. అనేకమంది కొత్తవారిని పరిచయం చేసి సినీజీవితం అందించిన అనుభవశాలి. ఇంత చేసినా జీవితం చరమాంకంలో కష్టాలలో మునిగితేలిన సగటు నటుడు. సమస్యల మధ్య తనువు చాలించిన దురదృష్టవంతుడు.

కెవిరెడ్డి బిఎన్‌రెడ్డి వంటి మహోన్నత దర్శకుడిని అందించి కడపజిల్లానుంచి తారాపథానికి చేరిన కొద్దిమంది అగ్రతారల్లో ఆయనొకరు. నాటకాల మీద రక్తితో సినీరంగంలో ప్రవేశించి అనేక ఢక్కాముక్కీలు తింటూ దాన్నే నమ్ముకుని అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి ఆయన. మాయాలోకం ఆయన తొలి చిత్రమైనా బాగా దగ్గరైంది మాత్రం 1951లో 'పాతాళ భైరవి'లోని పాత్రతోనే. 'సాహసము సేయరా డింభకా రాజకుమారి లభిస్తుంది' అంటూ ఎస్వీఆర్ నేపాల మాంత్రికుడి డైలాగులతో వూపేస్తుంటే సదాజపుడుగా పద్మనాభం 'మోసం గురూ' అంటూ దర్శనమిస్తాడు. 1932లో పుట్టి కన్నాంబ నాగభూషణం దంపతుల సహాయంతో రంగప్రవేశం చేసిన పద్మనాభం ఆ తర్వాతే పరిశ్రమ దృష్టిలో పడ్డాడు. మరీ ముఖ్యంగా ఎన్టీఆర్‌కు దగ్గరయ్యాడు. విజయా వారి కళాఖండం 'షావుకారు'(1949)లో మొద్దబ్బాయి పాత్రలో(ఆహార్యం దాదాపు అరగుండు బ్రహ్మానందం తరహాలో వుంటుంది) మెప్పించి తన స్థానం సుస్థిరం చేసుకున్నాడు. రేలంగి ఏకచ్ఛత్రంగా ఏలుతున్న కాలంలో ఆయనకూ రమణారెడ్డికి మధ్య తనకూ చోటు చిక్కించుకోవడం పద్మనాభం ప్రతిభకు నిదర్శనం. అలా అలా ఆయన 400కు పైగా చిత్రాల్లో నటించేశాడు.

హాస్యనటులందరూ నవ్వించే వారే అయినా అందులో రకరకాలు. చలాకీతనం, హావభావాలు, తమాషా పోకడలు, సంభాషణలు విచిత్ర విన్యాసాలు ఇలా ఒక్కొక్కరూ ఒక్కో దాంట్లో పట్టు సాధిస్తారు. రేలంగి టక్కరి తరహా మాటలు, ఎదుటి వారిని బుట్టలో పెట్టేయడం వంటివి ఎక్కువగా చేసేవారు. అల్లు రామలింగయ్య 'వ్వువ్వా' అంటూ మూలగడం, ఎదుటి వారిని ఎగాదిగా చూడడం వంటివి చేస్తాడు. రమణారెడ్డి రూపమే సగం నవ్వు పుట్టిస్తే ఆపైన ఆయన టక్కరి వేషాలు ఇంకా అలరిస్తాయి. పద్మనాభం వీటన్నిటికీ భిన్నమైన ప్రక్రియలు చూపించవలసివచ్చింది. ఆయన డైలాగ్ మాడ్యులేషన్‌పై దృష్టి పెట్టాడు. 'మాయాలోకం'లోనే ఆయన తన ప్రత్యేక ఉచ్చారణ చూపించడం అందరినీ ఆకర్షించింది. తర్వాత అదే ట్రేడ్‌మార్క్‌గా మారింది. తను నటించిన 'కార్తవరాయని కథ' తమిళ వెర్షన్‌లో నటించిన తంగవేలు నుంచి పద్మనాభం ఆ విద్యను మరింత బాగా వంటపట్టించుకున్నాడు.

మిగిలిన హాస్య నటులెవర్ని గుర్తుచేసుకున్నా వారి హావభావాలు, సన్నివేశాలు గుర్తుకొస్తాయి. వారందరిలోనూ అతి ప్రఖ్యాతులైన రాజబాబును తల్చుకుంటే హడావుడి, బ్రహ్మానందంను గుర్తుచేసుకుంటే వింత వేషాలు మదిలో మెదులుతాయి. అదే పద్మనాభంను అనుకోగానే 'అయ్యో అయ్యో' అని ముక్కుతో మాట్లాడే విదూషకుడే సాక్షాత్కరిస్తాడు. అదే ఆయన ప్రత్యేకత. ఎక్కువ చిత్రాల్లో గీతాంజలి ఆయనకు జోడీ. వీరిద్దరూ కలిసి నటించిన పూలరంగడులో ఈ విద్యను మరీ ఎక్కువగా చూపించాడు. జమునతో ఒక పాట కూడా వుంటుంది. వాస్తవానికి ప్రతి చిత్రంలోనూ పద్మనాభంకు ఒక పాట తప్పనిసరి. వాటిలో కొన్ని బాగా హిట్టయ్యాయి కూడా. ఇది ఆయన స్టార్‌డమ్‌ను తెలుపుతుంది. తర్వాతికాలంలో విషాద పాత్రలకు పేరెన్నికగన్న శారద కూడా ఆయనతో వినోద పాత్రలో కనిపించడం ఒక విశేషం. 'మూగమనసులు'లో సావిత్రిని పెళ్లి చేసుకునే పాత్రలో నటించడం కూడా ఆయనకే చెల్లింది. పద్మనాభం పాత్రల్లో హాస్యంతో పాటు



పద్మనాభం తనే ఆ బాధ్యతను కూడా నెత్తిన వేసుకోవడంతో ఆయన జీవితంలో మలి అధ్యాయం మొదలైంది. అలా మొదట 'శ్రీరామకథ' తీశారు. ఇందులో హరనాథ్, జయలలిత నాయకానాయికలు. అయితే ఈ కథ అందరికీ తెలిసిన రామాయణం కాక 'శ్రీమతి కళ్యాణం' అనే కొత్త కోణాన్ని తీసుకున్నారు. తను నారదుడి వేషం వేశారు. ఇందులో బాలు 'రామకథ శ్రీ రామకథ' అనే సుదీర్ఘ గీతం పాడారు. తర్వాత కుమ్మరి మొల్లగా సుపరిచితమైన రామాయణ రచయిత్రి కథను వాణిశ్రీతో 'కథానాయిక మొల్ల'గా చాలా చక్కగా తీసి బంగారు నంది పొందారు. కానీ ఆర్థికంగా ఈ చిత్రాలేవీ ఆయనను గట్టెక్కించలేదు. ఆయన నిర్మాణమూ ఆపలేదు.

ఒకింత బరువు బాధ్యతలు కూడా వుండేవి. చాలాసార్లు ఆయన అమాయకుడైన, కొత్తవాడైన హీరోకు అండదండగా నిలిచి నడిపించడం చూస్తాం. చలం సొంత చిత్రం 'మట్టిలో మాణిక్యం'లో గానీ ఆఖరుకు ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల కొన్ని చిత్రాల్లో గానీ కథకు సూత్రధారిగా ఆయన అగుపిస్తాడు. అక్కినేనితో 'పవిత్రబంధం, ఆత్మీయులు, దసరా బుల్లోడు, విచిత్రబంధం, జై జవాన్, అదృష్టవంతులు' వంటి ఎన్నో చిత్రాల్లో అగుపించిన ఆయన ఎన్టీఆర్‌తో మరింత ఎక్కువగా నటించారు. సాంఘిక, పౌరాణిక, జానపద అన్న తేడా లేకుండా అన్నింటిలోనూ అమరిపోయాడు. అయితే అందులో చెప్పుకోవలసింది – శ్రీకృష్ణ తులాభారం, శ్రీకృష్ణ సత్య వంటి చిత్రాల్లో ఎన్టీఆర్, కృష్ణ పాత్రల పక్కన వయస్యుడు వసంతయ్యగా నటించిన పద్మనాభం గురించి. 'దాగుడు మూతలు, పాండురంగ మహత్యం, రాము, కోడలు దిద్దిన కాపురం, కథానాయకుడు' వంటి చాలా చిత్రాలు వారి కాంబినేషన్‌లో రూపొందాయి. కృష్ణతో నటించిన 'రాజేశ్వరి విలాస్ కాఫీ క్లబ్'లో అలవాటులేని మాంసాహారం చేసి కోడి మీదకు



వచ్చినట్టు భ్రమపడే నరసింహశాస్త్రి పాత్ర మర్చిపోలేనిది. 'బంగారుబాబు'లో దర్శకుడు పుల్లయ్య వేషభాషలను అనుకరించే పాత్ర కూడా వెరైటీనే.

తక్కిన హాస్యనటులతో పోలిస్తే పద్మనాభం ఎక్కువకాలం నటించగలిగారు. వేషభాషలు మారిన తర్వాత కూడా కొనసాగాడు. ఇందుకు ఆయన క్రమశిక్షణ కూడా చాలా కారణం. ఎనిమిదిపదుల దరిదాపుకు చేరుతున్నా ఆయన నటన మానలేదు. కొన్నేళ్ల కిందట చక్రం సినిమాలో తన పాత్రలో తనే నటించి 'జగమంత కుటుంబం నాది' అన్న చరణాలు వినిపించి చిత్రానికి ప్రాణం పోశాడు.

పద్మనాభం కేవలం నటుడుగానే గాక నిర్మాతగానూ దర్శకుడుగానూ కూడా ప్రఖ్యాతి గాంచారు. ఎన్టీఆర్‌తో వున్న స్నేహాన్ని పురస్కరించుకుని సావిత్రి ద్విపాత్రాభినయంతో ఆయన హీరోగా దేవత చిత్రం తీసి ఘన విజయం సాధించారు. ఇందులో పద్మనాభం పిచ్చి రామదాసుగా నటించాడు. ఈ చిత్రం పెద్ద మ్యూజికల్ హిట్. ఎన్టీఆర్ 'బొమ్మను చేసి ప్రాణము పోసి' వంటి బరువైన విషాద గీతం ఆలపించిన చిత్రం కూడా అదే. ఈ ఊపుతో పద్మనాభం భమిడిపాటి రచించిన నాటిక ఆధారంగా పొట్టి ప్లీడరు చిత్రం తీశారు. ప్రధాన పాత్ర ఆయనదైనా శోభన్‌బాబు, గీతాంజలి జంటగా నటించారు. జానపద కథతో 1967లో 'శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న కథ' తీసి విజయం సాధించారు. ఈ చిత్రంతోనే గాయకుడిగా ఎస్పీబాలసుబ్రహ్మణ్యం పరిచయమైన సంగతి ఇప్పుడు సుప్రసిద్ధమే. సంగీత దర్శకుడైన కోదండ పాణి ఇందుకు ప్రధాన కారకుడైనా కొత్తగొంతును ధైర్యంగా ఆదరించిన పద్మనాభంను కూడా మర్చిపోలేము.

ఈ మూడు చిత్రాలు హేమాంబరదరరావు దర్శకత్వంలో తీసినా తర్వాత పద్మనాభం తనే ఆ బాధ్యతను కూడా నెత్తిన వేసుకోవడంతో ఆయన జీవితంలో మలి అధ్యాయం మొదలైంది. అలా మొదట 'శ్రీరామకథ' తీశారు. ఇందులో హరనాథ్, జయలలిత నాయకానాయికలు. అయితే ఈ కథ అందరికీ తెలిసిన రామాయణం కాక 'శ్రీమతి కళ్యాణం' అనే కొత్త కోణాన్ని తీసుకున్నారు. తను నారదుడి వేషం వేశారు. ఇందులో బాలు 'రామకథ శ్రీ రామకథ' అనే సుదీర్ఘ గీతం పాడారు. తర్వాత కుమ్మరి మొల్లగా సుపరిచితమైన రామాయణ రచయిత్రి కథను వాణిశ్రీతో 'కథానాయిక మొల్ల'గా చాలా చక్కగా తీసి బంగారు నంది పొందారు. కానీ ఆర్థికంగా ఈ చిత్రాలేవీ ఆయనను గట్టెక్కించలేదు. ఆయన నిర్మాణమూ ఆపలేదు. నూతన తారలతో కొంతభాగం రంగుల్లో 'జాతకరత్న మిడతంభొట్లు' తీసి చేతులు కాల్చుకున్నారు. అలాగే నాగభూషణం ప్రధాన పాత్రధారిగా చాలామంది తారలతో అజన్మ బ్రహ్మచారి తీసినా ఫలితం దక్కలేదు. తుఫాను బాధితుల సహాయార్థం తెలుగు నటీనటులు వేసిన సాంస్కృతిక ప్రదర్శనలను సినిమా వైభవం పేరిట చిత్రంగా విడుదల చేసి వైవిధ్యం కనబర్చారు. తర్వాత హిందీలో మొహమూద్ తీసిన 'కువారబాప్' అనే బరువైన చిత్రాన్ని పెళ్లికాని తండ్రిగా తెలుగులో తీసి నష్టపోయారు. భానుమతితో 'మాంగల్య భాగ్యం' అనే మరో సినిమా తీశారు. రేఖా అండ్ మురళీ ఆర్ట్స్ ప్రొడక్షన్స్‌లో ఇలా చిత్రాల జాబితాతో పాటు ఆయన ఆర్థిక భారాలూ పెరిగిపోయాయి.

మారిన కాలంతో పాటు మారిన పద్ధతులు, వయోభారం వల్ల పద్మనాభం చాలా కాలంగా పరిశ్రమకు దూరంగా వుండిపోయారు. 'టాటా బిర్లా మధ్యలో లైలా' ఆయన ఆఖరి చిత్రం. అడపా దడపా తన జ్ఞాపకాలు చెబుతూ కాలం గడిపి చివరికి నవ్వులే మిగిల్చి వెళ్లిపోయారు. ఆయనకు సంతాపం తెలిపేందుకు ఎవరూ రాలేదని విమర్శలు వచ్చాయి గానీ హాస్య రసాస్వాదకులు, కళాభిమానులు ఆయనకు మన:పూర్వక నివాళులర్పించారు.

- తెర

ఎక్కడున్నాయో...!

ఫ్రెండ్స్.... కింద మోటార్‌బైక్‌కు సంబంధించిన పేర్లు ఇంకా అది నడిపేటప్పుడు మనం వాడే పదాలు కొన్ని ఇక్కడ వున్నాయి. వాటిని ఇక్కడ వున్న బాక్సులో అడ్డంగానో, నిలువుగానో ఎలావున్నా సరే గుర్తుపట్టి సున్నా చుట్టండి.

1.helmet, 2.pads, 3.safety, 4.stop, 5.gear, 6.ride, 7.grips, 8.signal, 9.bike, 10.horn, 11.breakes, 12.trail.

S	P	F	N	R	O	H	A
S	P	M	I	J	C	N	M
X	A	G	Y	Y	X	S	F
E	D	Z	L	B	T	P	K
E	S	N	T	I	R	I	E
P	I	S	E	K	A	R	B
O	G	P	M	E	I	G	R
T	N	L	L	H	L	E	I
S	A	F	E	T	Y	A	D
Q	L	K	H	A	Z	R	E



నేనెవరో తెలుసా?

హలో పిల్లలూ... ఇవాళ మీకో చిన్న పరీక్ష. ఏంటంటే ఇక్కడ రకరకాల ప్రాణులున్నాయి చూశారుగా. వీటిలో నుండి ఒక ప్రాణి గురించి కొన్ని క్లూలు ఇస్తాము. వాటి ఆధారంగా దాని పేరేంటో చెప్పండి.

నన్ను అమెరికాలో కనుగొన్నారు.
నేను ఒకేసారి 20 నుండి 60 గుడ్లు పెడతాను.
నా శరీరం పొడవుగా వుంటుంది.
ఇప్పుడు చెప్పండి నేనెవరినో?

పే...ద్ద పీత



పొడవైన కాళ్లతో, గోళ్లతో ఉన్న అతిపెద్ద పీతను ఈ మధ్య కనుగొన్నారు. అది బ్రిటన్‌లో ఇంతకుముందు చూసిన అతిపెద్ద పీత జాతికి చెందినదే. అది ప్రపంచంలోనే అది పెద్దదట. అది పది అడుగుల పొడవుంది. అది ఇంకా పెరుగుతూనే ఉంది. అలా 100 అడుగుల వరకు పెరుగుతుందట. ఈ అతిపెద్ద మాన్‌స్టర్ ముద్దు పేరు క్రాబ్‌జిల్లా. దాని తరువాత పెద్దదయిన జపనీయుల పీత బాస్కెట్‌బాల్ సైజులో ఉంటుంది. లాటిన్‌లో మాక్రోఖీరా కీమ్‌ఫరిగా పిలిచే పీతను జాలరివాళ్లు ఫసిఫిక్ మహాసముద్రంలో పట్టుకున్నారు. దానిని బ్రిటన్‌కు ఎగుమతి చేశారు. ఇప్పుడు దాన్నే బర్మింగ్‌హామ్‌లోని నేషనల్ సీ లైఫ్ సెంటర్‌లో ప్రదర్శన కోసం ఉంచారు. ప్రస్తుతం అదే బ్రిటన్‌లో అతి పెద్ద పీత.

పీతలు నీళ్లలో వంగిపోయి నీరసంగా నడుస్తున్నట్టు కనిపిస్తాయి. ఎందుకంటే నీళ్లలో వాటి కాళ్లకు సరియైన ఆధారం ఉండదు. కానీ అది 2,500 అడుగుల లోతున్న చల్లని సముద్రాల్లో ఇతర జంతువులను చంపి తినే ప్రాణాంతక జీవి. అయితే దానికీ శత్రువులు లేకపోలేదు. అది కూడా మరెవరో కాదు. మానవులే దాని శత్రువులు. అవి జపనీయులకు మంచి రుచికరమైన ఆహారమట. మంచులా చల్లగా ఉండే నీళ్లున్న పైకప్పులేని ట్యాంకులో వాటిని ఉంచుతారు. మార్చి వరకు ఇంక అదే వాటి నివాసం. అక్కడ మిగతా వాటికన్నా అదే పెద్దదిగా కనిపిస్తుంది. కానీ దీనివల్ల వాటికి ఎటువంటి ప్రమాదమూ ఉండదు.

క్రాబ్‌జిల్లా ముందుకాళ్లతో ఆహారం తీసుకుంటుంది. అవి ఒక్కోటి 5 అడుగుల పొడవుంటాయి. చివరన పదునైన గోళ్లుంటాయి. ఇవి జపనీయులకు పసందైన విందు. వాటిని ఉడకబెట్టి ఉప్పు చల్లుకుని తింటారు. అయితే వసంత కాలంలో మాత్రం వాటిని తినకుండా నిషేధం విధిస్తారు. ఎందుకంటే ఆ సమయంలో అవి గుడ్లు పెడతాయట.

చెప్పండి చూద్దాం

ఫ్రెండ్స్... కింది బొమ్మలో చెప్పడానికి వీలులేనట్టుగా ఓ వింత జీవి కనిపిస్తోంది కదూ. కానీ అందులో వుంది ఒకటి కాదు కొన్ని జంతువుల భాగాలు కలిసి అదొక వింత జీవిలా అయింది. అయితే అవి ఏ జంతువు భాగాలో చెప్పగలరా.



బాలనేస్తాలు

నేర్చుకుందాం



సర్దగలరా?

హాయ్... ఇవాళ్ల మీకో పజిల్ తెచ్చామర్రా. కింద ఒక బాక్సు, ఆ పక్కనే గళ్లు కనిపించాయా. ఈగళ్లను అమర్చితే సరిగ్గా బాక్సులోకి సరిపోతాయి. అలాగని ఎలాపడితే అలా కాదు. గళ్లలో ఒకటి నలుపు ఒకటి తెలుపు అంటే చదరంగం గళ్లలా అన్నమాట. మరి ప్రయత్నించండీ!





మనిషి - బొమ్మ

హాయ్... ఇక్కడ మీకు ఇద్దరు ఇద్దరి మొహాలు కనిపిస్తున్నాయి కదూ. ఒకరి ఎదుట మరొకరు నుంచున్నట్టు. కానీ కొద్దిగా పరిశీలించి చూడండి. ఒకరి మొహంలోని సగభాగంలో మరో ముఖాన్ని పెయింట్ వేశారు. మరదే ఈ చిత్రంలోని తమాషా.



ఏం కనిపిస్తోందబ్బా...

హలో పిల్లలూ... ఈ బొమ్మని చూస్తుంటే మీకేమనిపిస్తుంది. పెద్ద చెట్టమధ్య ఓ చిన్న మొక్కవడలిపోయినట్లుగా ఉంది అంతేగా అంటారా. మీరన్నది కరెక్టే కానీ పుస్తకాన్ని కొద్దిగా దూరంగా పెట్టి చూసి ఏం కనిపిస్తుందో చెప్పండి.

జవాబులు

చెప్పగలరా... : గద్ద ముక్కు కుక్కపిల్ల శరీరం, బాతు కాళ్లు, శరీరంలో వెనుక భాగం కూడా బాతుదే.

నేనెవరో తెలుసా? : మొసలి

ఏం కనిపిస్తోందబ్బా... : అస్థిపంజరం

సర్దగలరా....:





హాకీ పండుగ
హలో ఇండియా

-షాహిన్ సుల్తానా

హాకీ...

చూడ్డానికి, పలకడానికి చిన్ని పదమే. అయితేనేం! ఉచ్ఛరించిన చాలు!! సంతోషమే సంతోషం. మరి జాతీయ క్రీడగా గుర్తింపు పొందిన హాకీని తల్చుకుంటే... హృదయం ఆనందంతో ఉప్పొంగడం, మోములో ఆ మాత్రం గర్వం తొణికిసలాడడం సహజమే.

అయితే ప్రస్తుతం దేశంలో హాకీ దుస్థితి, హాకీ ఆటగాళ్ల ఇబ్బందులు గుర్తు చేసుకుంటేనే బాధేస్తుంది. సొంత గడ్డపై తొలిసారి జరుగుతున్న ఈ టోర్నీలో ద్విగుణీకృత ఉత్సాహంతో బరిలోకి దిగాల్సిన ఆటగాళ్లు నిరాశ నిస్పృహలతో ఆడాల్సి వస్తోంది. భారత హాకీ సమాఖ్య వైఖరే దీనికి కారణం. తమ బకాయిలు రాబట్టేందుకు ఈ ప్రపంచ కప్ కోసం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని ఆటగాళ్లు బహిష్కరించాల్సి వచ్చింది. గత టోర్నమెంట్లలో తమకు రావాల్సిన పారితోషికాల బకాయిలు చెల్లించకుంటే శిబిరంలో పాల్గొనేదిలేదని ఆటగాళ్లు మొండికేశారు. దీంతో దిగొచ్చిన భారత హాకీ సమాఖ్య 50 కోట్లతో ఆటగాళ్ల బకాయిలు చెల్లించింది. హాకీని ఆదుకునేందుకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు కూడా ఆర్థిక సహాయం చేయాల్సి వచ్చింది.

ప్రతి అంశానికీ చీకటివెలుగులు వెన్నంటే వుంటాయి. ఈ చీకటి తొలగిపోయి మన హాకీ జట్టు వెలుగులు విరజిమ్మాలని కోరుకుందామా.

నేటి నుండి హాకీ సమరం ప్రారంభం కానుంది. హాకీ ప్రపంచ కప్ భారత్‌లో జరగడం ఇదే తొలిసారి. ఈ టోర్నీ న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో నేడే ప్రారంభం కానుంది. హాకీ వరల్డ్ కప్ – 2010ను హీరోహోండా మోటార్స్ స్పాన్సర్ చేస్తోంది. హాకీ వరల్డ్ కప్‌ను హాకీ వరల్డ్ ఛాంపియన్‌షిప్ అని కూడా పిలుస్తారు. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) 1971లో తొలి ప్రపంచ కప్ నిర్వహించింది. ప్రతి నాలుగేళ్లకోసారి (ఒక ఒలింపిక్స్‌కు, మరో ఒలింపిక్స్‌కు మధ్య) ఈ టోర్నీని నిర్వహిస్తారు. మహిళా హాకీ ప్రపంచ కప్‌ను 1974న ప్రారంభించారు. దీన్ని1981 వరకు మహిళా హాకీ అసోసియేషన్ అంతర్జాతీయ సమాఖ్య నిర్వహించింది. తర్వాత దీని గవర్నింగ్ బాడీ అంతర్జాతీయ హాకీ సమాఖ్యలో కలిసిపోయింది.

ప్రపంచ కప్‌లో ఐదు దేశాలు ఆధిపత్యం వహించాయి. వరల్డ్ కప్‌ను పాకిస్తాన్ నాలుగు సార్లు కైవసం చేసుకొని అగ్రస్థానంలో నిలిచింది. నెదర్లాండ్స్ మూడుసార్లు, జర్మనీ రెండుసార్లు, భారత్, ఆస్ట్రేలియా ఒక్కోసారి ప్రపంచ విజేతగా నిలిచాయి. 2006 హాకీ ప్రపంచ కప్ జర్మనీలో సెప్టెంబర్ 6–17 తేదీల్లో జరిగింది. ఆ టైటిల్‌ను ఆతిథ్య జర్మనీ సొంతం చేసుకుంది. ఫైనల్లో 4–3 గోల్స్‌తో ఆస్ట్రేలియాను ఓడించిన జర్మనీ రెండోసారి ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించింది.

హాకీ ప్రపంచ కప్ నిర్వహించాలనే తలంపు తొలుత పాకిస్తాన్ ఎయిర్ మార్షల్ నూర్‌ఖాన్‌కు వచ్చింది. ఆయన తన ఆలోచనను ప్రపంచ హాకీ సమాఖ్యకు తెలిపాడు. బ్రస్సెల్స్‌లో ఏప్రిల్ 12, 1970లో జరిగిన ఎఫ్ఐహెచ్ కౌన్సిల్‌లో ఈ ఆలోచనను ప్రతిపాదించారు. తొలి ప్రపంచ కప్‌ను పాకిస్తాన్‌లో అక్టోబర్ 1971లో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే తొలి ప్రపంచ కప్‌ను పాక్‌లో నిర్వహించే విషయం మీద రాజకీయ వివాదాలు చెలరేగాయి. భారత్, పాక్‌ల మధ్య అప్పటికి ఆరేళ్ల క్రితమే యుద్ధం జరిగింది. తమ దేశంలో ప్రపంచ కప్ ఆడాల్సిందిగా పాకిస్తాన్ ఆహ్వానించడంతో సంక్షోభం తలెత్తింది. హాకీ ప్రపంచ కప్‌లో భారత్ పాల్గొనడాన్ని పాకిస్తాన్ క్రికెటర్ అబ్దుల్ హఫీజ్ కర్దార్ నేతృత్వంలోని పాకిస్తానీయులు వ్యతిరేకించారు. రాజకీయ వివాదం నుండి టోర్నమెంట్‌ను దూరంగా ఉంచేందుకు తొలి ప్రపంచ కప్ వేదికను పాకిస్తాన్‌కు దూరంగా స్పెయిన్‌లోని బార్సిలోనాకు తరలించారు. ఇది తటస్థ వేదికగా అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది. 1971 మార్చిలో జరిగిన ఆ టోర్నీలో పది దేశాలు మాత్రమే పాల్గొన్నాయి. అతి తక్కువ దేశాలు పాల్గొన్న ప్రపంచ కప్ అదే. 1978 ప్రపంచ కప్‌లో

14 దేశాలు పాల్గొన్నాయి. 2002 ప్రపంచ కప్‌లో 16 దేశాలు పాల్గొన్నాయి. ఇప్పటివరకు అతిపెద్ద ప్రపంచ కప్ అదే.

తొలి మూడు ప్రపంచ కప్‌లను ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించారు. 1978 ప్రపంచ కప్ మాత్రం గత ప్రపంచ కప్ తర్వాత మూడేళ్లకు నిర్వహించారు. 1982 నుండి ప్రతి నాలుగేళ్లకోసారి ప్రపంచ కప్‌ను నిర్వహిస్తున్నారు. మొత్తం మీద నాలుగేళ్లకోసారి జరిగే ఒలింపిక్స్‌కు మధ్య వచ్చేట్లు దీన్ని నిర్వహిస్తున్నారు.

రెండంచెల టోర్నీ

టోర్నీని రెండంచెల్లో – క్వాలిఫికేషన్ దశ, ఫైనల్ టోర్నమెంట్ దశగా నిర్వహిస్తున్నారు. రెండు దశల్లోనూ ఫార్మాట్ ఒకే విధంగా ఉంటుంది. 1977 నుండి క్వాలిఫికేషన్ దశను ప్రవేశపెట్టారు. టోర్నీలో పాల్గొనే జట్లన్నీ క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆడాల్సి ఉంటుంది. జట్లను రెండు లేదా అంతకంటే ఎక్కువ గ్రూపులుగా విభజిస్తారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ టోర్నమెంట్‌కు సాధారణంగా అర్హత సాధిస్తాయి. మిగిలిన జట్లను ప్లే ఆఫ్ పద్ధతిలో ఎంపిక చేస్తారు.

వరల్డ్ కప్ ఫైనల్ టోర్నమెంట్‌లో వివిధ ఖండాల ఛాంపియన్లు, క్వాలిఫై అయిన ఇతర జట్లు పాల్గొంటాయి. కొన్నిసార్లు ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన జట్టు లేదా ఉపఖండపు రన్నరప్ జట్లు కూడా పాల్గొంటాయి. ఈ జట్లను మళ్లీ గ్రూపులుగా విభజించి రౌండ్ రాబిన్ లీగ్‌లో టోర్నమెంట్ నిర్వహిస్తారు. ప్రస్తుతం ప్రపంచంలో జట్ల ర్యాంకుల ఆధారంగా గ్రూపులను విభజిస్తారు. ప్రతి గ్రూపులో మొదటి రెండు స్థానాలు సాధించిన జట్లు సెమీఫైనల్ మ్యాచ్‌లో తలపడతాయి. విజయం సాధించిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్లో ఓడిపోయిన జట్లు మూడు, నాలుగు స్థానాల కోసం తలపడతాయి. మిగిలిన జట్లు తర్వాతి స్థానాల కోసం తలపడతాయి. గ్రూపులో మూడు లేదా నాలుగో స్థానంలో నిలిచిన జట్లు టోర్నీలో ఐదవ స్థానం కోసం, గ్రూపులో ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన జట్లు టోర్నీలో తొమ్మిదవ స్థానం కోసం తలపడతాయి.

పాకిస్తాన్ జట్టు ఇప్పటివరకు ఆరుసార్లు ఫైనల్‌కు చేరుకొని నాలుగుసార్లు విజేతగా నిలిచింది. ప్రపంచ కప్‌లో ఇదే అత్యుత్తమ ప్రతిభ. నెదర్లాండ్స్ ఐదుసార్లు ఫైనల్‌కు వెళ్లి మూడుసార్లు టైటిల్ సాధించింది. ఇటీవల కాలంలో జర్మనీ జట్టు అత్యద్భుత ప్రతిభ కనబరుస్తోంది. ఆ జట్టు 2002, 2006 సంవత్సరాల్లో ప్రపంచ విజేతగా నిలిచింది. అంతేకాదు 1971లో మినహా ప్రతి ప్రపంచ కప్‌లో ఆ జట్టు సెమీఫైనల్‌కు వెళ్లింది.

హాకీ పుట్టుక

హాకీకి దీర్ఘకాల చరిత్ర ఉంది. ఆధునిక హాకీ మాత్రం 19వ శతాబ్దంలో ఇంగ్లండ్‌లో ప్రారంభమైంది. నాలుగువేల సంవత్సరాలకు పూర్వమే హాకీని పోలిన గేమ్‌ను వేర్వేరు ప్రాంతాల్లో ఆడేవారు. ఒక కర్రతో బంతిని ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి కొట్టే ఆటను ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఆడేవారు. ఈ ఆట వాస్తవానికి ఎక్కడ ప్రారంభమైందో కచ్చితంగా చెప్పలేం.

లభ్యమైన ఆధారాల ప్రకారం నాలుగువేల సంత్సరాల క్రితం ఈజిప్ట్‌లోని నీల్‌వ్యాలీలో గల బెనీ హసన్ టూంబ్స్‌లో హాకీని తొలుత ఆడారు. ఇతర ఆధారాల ప్రకారం పర్షియన్లు, రోమన్లు, ఇథియోపియన్లు హాకీని తమకిష్టమొచ్చిన రీతిలో ఆడేవారు. దీన్ని టీం గేమ్‌గా క్రీస్తు పూర్వం 478లో ఆడారు. ఆధునిక హాకీలో మాదిరిగా ఆరేసి ఆటగాళ్లతో రెండు జట్లు ఒక బంతి కోసం తలపడేవి. క్రీస్తు పూర్వం 1272లో మంగోలియ[illegible] ఆధునిక హాకీని పోలిన గేమ్‌ను వేయి సంవత్సరాల వరకు ఆడవా... చిలీల స్థిరపడిన యూరోపియన్లు 16వ శతాబ్దంలో ఆధునిక హాకీని పోలిన 'ఛ్యూకా'

హాకీ ట్రోఫీ

ఈ ట్రోఫీని పాకిస్తాన్ సైనికుడు బషీర్ మూజిద్ డిజైన్ చేశాడు. ట్రోఫీని వెండి కప్పుతో తయారు చేశారు. దానిపై చిక్కనైన పుష్పాలతో డిజైన్ ఉంది. కప్పుపై ప్రపంచ పటంతో కూడిన గ్లోబ్ ఉంది. గోల్డ్, సిల్వర్‌తో కూడిన ఆ గ్లోబ్ ఐవరిని కలిగి ఉంది. దానిపై హాకీ స్టిక్, ఒక బంతి పెట్టారు. బేస్ లేకుండా ట్రోఫీ 650 మిల్లీ మీటర్ల ఎత్తు ఉంటుంది. బేస్‌తో కలిసి 650 మిలీమీటర్ల ఎత్తుంది. దీని బరువు 11,560 గ్రాములు. అందులో 895 గ్రాముల బంగారం, 6815 గ్రాముల వెండి, 350 గ్రాముల ఐవరి, 3500 గ్రాముల టేకు కలిగి ఉంది. ఈ ట్రోఫీని మార్చి 27, 1971న అంతర్జాతీయ హాకీ సమాఖ్య అధ్యక్షుడు రానే ఫ్రాంక్‌కు బెల్జియంలో పాకిస్తాన్ రాయబారి హెచ్.ఇ. మసూద్ లాంఛనంగా అందజేశారు.

ఇప్పటివరకు తొమ్మిది దేశాలు హాకీ ప్రపంచ కప్‌ను నిర్వహించాయి. నెదర్లాండ్స్ 1973, 1998ల్లో ప్రపంచ కప్‌కు ఆతిథ్యమిచ్చి విజేతగా నిలిచింది. జర్మనీ 2006లో ఆతిథ్యమిచ్చి టైటిల్ సాధించింది. స్పెయిన్ (1971లో), ఇంగ్లండ్ (1986లో), పాకిస్తాన్ (1990లో) టోర్నీలకు ఆతిథ్యమిచ్చి రన్నరప్‌గా నిలిచాయి. ఆస్ట్రేలియా (1994లో) మూడో స్థానం సాధించిన ఆతిథ్య జట్టు.

ప్రపంచ కప్‌లో ఇప్పటివరకు ఆసియా, యూరప్, ఓసియానా (ఆస్ట్రేలియా) ఖండాల జట్లు పాల్గొన్నాయి.

ఖండాల వారీగా విజేతలు...

ఆసియా - ఐదు టైటిల్స్ (పాకిస్తాన్ - 4, భారత్ - 1)

యూరప్ - ఐదు టైటిల్స్ (నెదర్లాండ్స్ - 3, జర్మనీ - 2)

ఓసియానా - ఒక టైటిల్ (ఆస్ట్రేలియా)

ఆఫ్రికా - నాలుగో స్థానం (కెన్యా - 1971)

అమెరికా - ఆరో స్థానం (అర్జెంటీనా - 1986)



భారత్ ప్రపంచ విజేతగా నిలిచిన మధుర క్షణాలు...

భారత్ ప్రపంచ హాకీ టైటిల్‌ను ఒకసారి మాత్రమే సాధించింది. కౌలాలంపూర్‌లో జరిగిన మూడవ ప్రపంచ కప్ (1975)లో విజేతగా నిలవడం భారత హాకీకి మర్చిపోలేని ఘటన. అజిత్ పాల్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు పాకిస్తాన్‌ను ఫైనల్లో 2-1తో మట్టికరిపించింది. అయితే హాకీ చరిత్రలో అది అత్యంత వివాదాస్పద మ్యాచ్‌గా నిలిచింది. ఆ మ్యాచ్‌లో జాహిద్ షేక్ గోల్ చేసి పాకిస్తాన్‌కు 1-0 ఆధిక్యత అందించాడు. కొద్దిసేపటి తర్వాత లభించిన పెనాల్టీ కార్నర్‌ను సుర్జీత్ సింగ్ గోల్‌గా మరల్చి స్కోరును సమం చేశాడు. తర్వాత అశోక్ కుమార్ కొట్టిన ఫ్రీ కిక్ గోల్‌పోస్ట్‌లోకి వెళ్లింది. అయితే అతడు గోల్‌లైన్ దాటి బంతిని కొట్టాడని పాక్ ఆటగాళ్లు అభ్యంతరం తెలిపారు. కానీ అంపైర్ జి విజయనాథన్ (మలేసియా) దాన్ని అంగీకరించకుండా గోల్ అయినట్లు ప్రకటించారు. దీంతో భారత్ శిబిరం ఆనందోత్సాహాల్లో మునిగిపోయింది. సెమీఫైనల్లో మలేసియాను 2-1 గోల్స్‌తో ఓడించి భారత్ ఫైనల్లోకి అడుగుపెట్టింది.

అతిథి దేవోభవ

భారత్ ఆతిథ్య దేశంగా ప్రపంచ కప్‌కు అర్హత సాధించింది. యూరప్, ఓసియానియాల నుండి మూడు జట్లు అర్హత సాధించాయి. మూడు క్వాలిఫికేషన్ టోర్నీల్లో విజేతగా నిలిచిన మూడు జట్లు కూడా ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తాయి. మొత్తం మీద 12 జట్లు ప్రపంచ కప్‌లో పాల్గొంటాయి.

ఖండం	టోర్నమెంట్	క్వాలిఫయర్స్
ఆఫ్రికా	ఆఫ్రికా కప్ ఫర్ నేషన్స్	దక్షిణాఫ్రికా
ఆసియా	ఆసియా కప్ కొరియా	
యూరప్	యూరో హాకీ నేషన్స్ ఛాంపియన్‌షిప్	ఇంగ్లండ్, జర్మనీ, నెదర్లాండ్స్, స్పెయిన్
ఓసియానియా	ఓసియానియా కప్	ఆస్ట్రేలియా
పాన్ అమెరికా	పాన్ అమెరికన్ కప్	కెనడా
క్వాలిఫయర్స్	క్వాలిఫయర్ - 1 (పాకిస్తాన్, జపాన్, పోలండ్, ఫ్రాన్స్, రష్యా, ఇటలీ	
	క్వాలిఫయర్ - 2(న్యూజిలాండ్, చైనా, మలేసియా, ఆస్ట్రియా, స్కాట్లాండ్, వేల్స్)	
	క్వాలిఫయర్ - 3 (అర్జెంటీనా, బెల్జియం, చిలీ, చెక్ రిపబ్లిక్, ఐర్లాండ్, అమెరికా)	
ఆతిథ్య జట్టు	భారత్	

గ్రూపులు

గ్రూప్ - ఎ : జర్మనీ, నెదర్లాండ్స్, కొరియా, న్యూజిలాండ్, కెనడా, అర్జెంటీనా

గ్రూప్ - బి : ఆస్ట్రేలియా, స్పెయిన్, ఇంగ్లండ్ , పాకిస్తాన్, భారత్, దక్షిణాఫ్రికా



అనే ఆట ఆడేవారు. డంబంగ్ అనే గేమ్‌ను పశ్చిమ ఆస్ట్రేలియాలో స్థిరపడిన నూంగర్ జాతీయులు ఆడేవారు. ఇంగ్లండ్‌లో హాకీని పోలిన కంబుకా అనే ఆటను ఆడేవారు. ఇది స్కాట్లాండ్‌లో షింటీ, ఫ్రాన్స్‌లో జ్యూ డి మెయిల్, నెదర్లాండ్స్‌లో హెట్ కాల్వెన్ అనే వేర్వేరు పేర్లతో హాకీని పోలిన గేమ్‌ను ఆడేవారు. హాకీ అనే పదం 1527లో వెలుగులోకి వచ్చింది. ఫ్రెంచ్ పదం 'హుక్, హాక్' నుండి రూపాంతరం చెంది 'హాక్వెట్'గా తర్వాత 'హాకీ'గా మారింది.

ఆధునిక హాకీ

ఆధునిక హాకీని 19వ శతాబ్దంలో ఇంగ్లండ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆడేవారు. కొంతమంది యువకులు హాకీ క్రీడను ఆడతారని 1853లో ఇంగ్లండ్‌కు చెందిన లార్డ్ లైటన్ రాసిన పుస్తకంలో ప్రస్తావించారు. హాకీలో తొలి క్లబ్ 'బ్లాక్ హీత్'ను ఇంగ్లండ్‌లోని లండన్‌లో 1840లో నెలకొల్పారు. అప్పుడు ఆధునికతకు బదులుగా దూకుడు గేమ్ ఆడేవారు. దీంతో మైదానం విశాలంగా (247 మీ క్వీ 64 మీ) ఉండేది. నల్లటి రబ్బరు బంతి, ఒక కర్రను ఈ గేమ్‌కు ఉపయోగించేవారు. ఆధునిక హాకీని మిడిలెక్స్ క్రికెట్ క్లబ్ లండన్ బయట ముఖ్యంగా ట్రినిడాడ్‌లో ప్రచారంలోకి తెచ్చింది. చలికాలంలో వ్యాయామంగా మిడిలెక్స్ క్రికెటర్లు హాకీని ఫుట్‌బాల్ నిబంధనలతో ఆడేవారు. 1874లో హాకీలో ప్రత్యేక నిబంధనలను ప్రవేశపెట్టారు. 1875లో హాకీకి అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. 1886లో లండన్‌కు చెందిన ఏడు క్లబ్బులు కలిసి కొత్త జాతీయ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశాయి. తొలి అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌ను 1895లో నిర్వహించారు. 1908 ఒలింపిక్స్ (లండన్)లో హాకీని తొలిసారి ఆడారు. 1928 ఒలింపిక్స్ (ఆమ్‌స్టర్‌డామ్)లో హాకీకి విశేష స్థానం లభించింది. 1924లో పారిస్‌లో తొలి అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఏర్పాటైంది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రపంచమంతా ఒకే నిబంధనలను 1970 నుండి అమలు చేయనారంభించారు. అప్పటి నుండి సింథటిక్ గ్రాస్ మైదానాల్లో ఆడనారంభించారు. 1980 నుండి సింథటిక్ మైదానాలను ప్రవేశపెట్టడంతో హాకీలో వేగం పెరిగింది.

మహిళా హాకీ

మహిళా హాకీని 1887 నుండి బ్రిటిష్ యూనివర్శిటీల్లో, స్కూల్స్‌లో ఆడేవారు. ఐరిష్ హాకీ యూనియన్ ఆధ్వర్యంలో 1894లో తొలి జాతీయ మహిళా హాకీ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. 1927లో అంతర్జాతీయ హాకీ అసోసియేషన్ ఏర్పాటైంది.

భారత్‌లో హాకీ ప్రవేశం

హాకీని బ్రిటిష్ ఆర్మీ రెజిమెంట్ దళాలు భారత్‌లో 1860-70 కాలంలో ప్రవేశపెట్టాయి. అతిస్వల్ప కాలంలోనే స్థానిక ప్రజల ఆదరణను చూరగొన్నాయి. తర్వాతి కాలంలో భారత్, పాకిస్తాన్‌లోనే హాకీని ఎక్కువగా ఆడారు. తొలి హాకీ క్లబ్‌ను కొల్‌కతాలో 1885-86లో నెలకొల్పారు. వెంటనే బొంబాయి, పంజాబ్‌ల్లో కూడా క్లబ్‌లు నెలకొల్పారు. 1928లో ఆమ్‌స్టర్‌డామ్ ఒలింపిక్స్‌లో తొలిసారి హాకీని ప్రవేశపెట్టారు. ఆ తొలి ఒలింపిక్ స్వర్ణాన్ని ప్రత్యర్థులకు ఒక్క గోల్ కూడా చేసే అవకాశమివ్వకుండా భారత్ సాధించింది. ఆ టోర్నీలో ధ్యాన్‌చంద్ ఆటతీరు ప్రేక్షకుల ఆదరణను చూరగొంది. 1928 నుండి 1956 మధ్య కాలంలో భారత్ వరుసగా ఆరు ఒలింపిక్ స్వర్ణ పతకాలు సాధించింది. భారత జట్టు వరుసగా 24 మ్యాచుల్లో గెలిచింది. 178 గోల్స్ చేసి ఏడు గోల్స్ మాత్రమే ప్రత్యర్థులకిచ్చింది. భారత హాకీకి అది స్వర్ణ యుగం. భారత హాకీ జట్టులో మూడు దశాబ్దాలపాటు బల్బీర్ సింగ్ అనే పేరుతో ఐదుగురు ఆటగాళ్లు కొనసాగడం విశేషం. 1960లో రోమ్ ఒలింపిక్స్ ఫైనల్లో పాకిస్తాన్ చేతిలో ఓటమితో భారత్ స్వర్ణ యుగం ముగిసింది. భారత హాకీని తలుచుకోగానే ధ్యాన్‌చంద్, కెడి సింగ్, ధనరాజ్ పిళ్లే, దిలీప్ టిర్కేల పేర్లు గుర్తుకొస్తాయి. వీరి కొత్త టెక్నిక్, ఆటపట్ల అంకితభావంతో భారత హాకీ కొత్త పుంతలు తొక్కింది. ★

దాన ధర్మాల వెనుక... బాబోయ్!!



అబ్బో ఆయనా అపర దానకర్ణుడు, చేతికి ఎముకలేదు, కుడి చేతితో చేసిన దానం ఎడమ చేతికి తెలియదు.

ఆ పెద్దమనిషా తనకుందో లేదో అని కూడా చూసుకోకుండా పొగిడినవారికల్లా ఈనాములిచ్చాడు, ఆస్తి మొత్తం దాన ధర్మాలకే ఖర్చయిపోయింది, చివరికి బిడ్డలు మరొకరిదగ్గర ధర్మం అడుక్కోవాల్సిన దుస్థితి కల్పించాడు, ఎందుకొచ్చిన దాన ధర్మాలు!

ముందు మనం, మన కుటుంబం సంగతి చూసుకోవాలి, ఆ తరువాతే మనకు కలిగిన దానిలో చేయగలిగిన మేరకు దాన ధర్మాలు చేయాలి, గొప్పలకు పోకూడదు. కుటుంబానికి లేకుండా దాన ధర్మాలు చేయాలని ఎవరు చెప్పారు?

ఆయనకంటే ఆస్తిపాస్తులున్నవారు లోకంలో ఎందరో ఉన్నారు, పిల్లికి బిచ్చం కూడా పెట్టరు. అయినా దానం ఇస్తే ఎవరైనా ఎందుకు వద్దంటారు, ఇచ్చేవాళ్లు ఇస్తుంటే పుచ్చుకునే వారు ఎంచక్కా పుచ్చుకుంటారు.

ఏదైనా తేడా వచ్చిందనుకోండి 'ఏం మేం ఇమ్మని అడిగామా? పేరు ప్రతిష్టల కోసమో, మరొక దానికోసమో ఎందుకిచ్చారో ఎవరికి తెలుసు?' అని జనం రివర్స్ అవుతారు. ఇవన్నీ మనకు తెలిసినవే.

ఇక దానధర్మాల విషయానికి వస్తే కొంతమంది ఉంటారు. పాతిక రూపాయల చేతుల్లేని చొక్కాలు తయారు చేయించి, వెనుకా ముందూ తమ దానం, ధర్మం ఏ సందర్భంగా ఎందుకు ఇచ్చారో పెద్ద అక్షరాలతో రాయిస్తారు. వాటిని వేసుకు తిరేగేవారు ధర్మం చేసినవారికి ఉచిత సంచార ప్రచారం కల్పించాలని కోరుకోవటం తప్ప మరొకటి ఏముంది. ఇలాంటి వాటి వల్ల పెద్దగా నష్టం లేదు.

కొంతమంది ఉంటారు, వేసవికాలంలో గ్రామాలకు ఉచితంగా తమ సొంత ఖర్చుతో మంచినీళ్లు అందచేస్తారు. అందించే నీళ్లకంటే చేసుకునే ప్రచారం చాలా ఎక్కువ. భవిష్యత్తులో వారు ఎన్నికల్లో పోటీ చేయాల్సి వచ్చిందనుకోండి, ఇదిగో ఇలాంటి వివరాలన్నీ సచిత్రంగా అధిష్టానాలకు సమర్పించి తమ సేవా పరాయణత్వాన్ని చూసి సీటు ఇమ్మంటారు. ఇదిగో ఇలాంటి వారితోనే తంటా వస్తుంది. అయితే వీరు ఒక నియోజకవర్గానికో, ఒక ప్రాంతానికో మాత్రమే పరిమితం అవుతారు. కానీ కొంతమంది ఉన్నారు. బిల్‌గేట్స్, వారెన్‌బఫెట్, రాక్‌ఫెల్లర్ వంటివారు మొత్తం ప్రపంచానికి దాన ధర్మాలు చేస్తారు. వీరు మాత్రం మహా మహా ప్రమాదకారులు.

ప్రపంచంలో ప్రమాదకారులుగా ఉన్న వ్యాధుల నివారణకు అవసరమైన టీకాల(వ్యాక్సిన్లు) పరిశోధనకు తాను 10 బిలియన్ డాలర్లు విరాళంగా ఇవ్వనున్నట్లు బిల్‌గేట్స్ ప్రకటించాడు. బిల్‌గేట్స్ అంటే తెలుసుగా చదువు సంధ్యలు పెద్దగా అబ్బకపోయినా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రవేశించి ప్రపంచంలో నంబర్ వన్‌గా తయారయ్యాడు. అదే స్థాయిలో స్వల్పకాలంలోనే ఎడా పెడా సంపాదించాడు. బిలియన్ అంటే వందకోట్లు, ఒక డాలర్ అంటే మన రూపాయల్లో 46 రూపాయలు (మారుతూ ఉంటుంది), పది బిలియన్ డాలర్లంటే 46వేల కోట్ల రూపాయలు. అవాక్కయ్యారా? అవకండి. వారెన్‌బఫెట్ అనే పెద్ద మనిషి బిల్‌గేట్స్ ఫౌండేషన్‌కు ఒక్క 2006 సంవత్సరంలోనే ఇచ్చిన విరాళం 31 బిలియన్ డాలర్లు. అంటే దాదాపు రెండులక్షల కోట్ల రూపాయలు. మన రాష్ట్ర రెండు సంవత్సరాల బడ్జెట్‌కు సమానం. నమ్మశక్యంగా లేదు కదూ!! ఇలాంటి ధర్మం విలువ 500 బిలియన్ డాలర్లని అంచనా. ఈ మొత్తం కూడా ధనికులు చట్టపరంగా, బహిరంగంగా ఎగ్గొట్టిన పన్ను అని అర్థం చేసుకోవాలి.

ధనికులకు ఇంత ఉదారత్వం వచ్చిందంటే వారిలో మారుమనసు కలిగినట్లే భావించాలా? ఆఫ్రికాలో మహమ్మారిగా ఉన్న మలేరియా నివారణకు అవసరమైన వ్యాక్సిన్ తయారీకి బిల్‌గేట్స్ వందకోట్ల డాలర్ల విరాళం ఇస్తే దానికి ప్రతిఫలంగా వెయ్యికోట్ల డాలర్ల లాభాలను సంపాదిస్తాడని అంచనా. బిల్‌గేట్స్ వ్యాపారం ఒక్క సాఫ్ట్‌వేర్ రంగానికే పరిమితం కాలేదు. సాఫ్ట్‌వేర్ చిప్స్ నుంచి బంగాళాదుంపల చిప్స్ వరకు ఆయన పెట్టుబడులు లేని రంగం లేదు. బిల్‌గేట్స్ పెట్టుబడి పెట్టిన ఔషధ కంపెనీల దగ్గర మలేరియా వ్యాక్సిన్ పరిశోధనకు అవసరమైన నిధులు లేక కాదు. దానధర్మాల పేరుతో చేసే ఖర్చుకు ఆదాయపన్ను మినహాయింపు ఉంటుందని తెలిసిందే కదా. ఆ సొమ్మును విశ్వ కళ్యాణానికి ఉదారంగా ఇస్తున్నట్లు డబ్బా కొట్టుకోవచ్చు, ఆచరణలో తమ కంపెనీలకే దాన్ని విరాళంగా ఇచ్చుకోవచ్చు. అదే కంపెనీ సొమ్మును ఖర్చు చేస్తే గొప్ప దాత అనే పేరు రాదు కదా! ఇదీ అసలు కథ.

బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ వారు మన దేశం, రాష్ట్రంలో కూడా పోలియో, మీజిల్స్ నివారణకు విరాళం ఇచ్చారు. దీనికి ప్రతిగా మన దేశంలో అనేక ప్రభుత్వాలు బిల్‌గేట్స్ సాఫ్ట్‌వేర్, కంప్యూటర్‌లను కొనుగోలు చేశాయి. ఇచ్చిన విరాళం కంటే అనేక రెట్లు లాభం సంపాదించారు. నైజీరియాలోని చమురు కంపెనీలలో బిల్‌గేట్స్ పెట్టుబడులు ఉన్నాయి. ఆ కంపెనీలు వదిలిన వ్యర్థపదార్థాలు నదులను, సరస్సులను కలుషితం చేశాయి. మండించిన వాయువుల కారణంగా ఉప ఉత్పత్తులుగా తయారైన విషపూరిత బెంజెన్, క్రోమియం, పాదరసం వంటివి పిల్లల్లో వ్యాధినిరోధక శక్తిని తగ్గిస్తూ పోలియో, మీజిల్స్ బారిన పడేస్తున్నాయి. మరోవైపున అదే గేట్స్ ఫౌండేషన్ పోలియో చుక్కలను ధర్మంగా వేస్తున్నది. బహుళజాతి కంపెనీలు విడుదల చేస్తున్న వ్యర్థ పదార్థాలు అనేక కొత్త రోగాలకు కారకులవుతున్నాయి. అవే కంపెనీలు వాటి నిరోధానికి ఔషధాలను తయారు చేస్తున్నాయి. అలాంటి అబోట్ లేబరేటరీలో బిల్‌గేట్స్ పెట్టుబడి పెట్టారు. అంటే రెండురకాలుగానూ లాభం పొందుతున్నారు. ఆఫ్రికాలో ఆయిల్ డ్రిల్లింగ్ సందర్భంగా ఏర్పడిన గోతులు దోమల వృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయి. అలాంటి ఆయిల్ కంపెనీల్లో ఒకటైన ఎక్సాన్‌మోబిల్‌లో కూడా గేట్స్‌కు 42.3 కోట్ల డాలర్ల పెట్టుబడి ఉంది. మరోవైపున అక్కడి మలేరియా నిరోధానికి కూడా అదే పెద్దమనిషి 21.8 కోట్ల డాలర్ల విరాళం ఇస్తున్నారు. విరాళం అంటే ఒక్కసారి ఇచ్చేదే, మరి పెట్టుబడిపై లాభాలు జీవితాంతం వస్తాయి.

వాక్సిన్ లేకపోతే మలేరియాను నివారించలేమా? ఆఫ్రికా దేశమైన ఎరిత్రియాలో గత ఏడు సంవత్సరాలలో ఎలాంటి వ్యాక్సిన్ లేకుండా 85శాతం మలేరియా మరణాలను అరికట్టారు. ఎలా? ప్రజారోగ్య పథకంలో భాగంగా దోమలను దూరంగా ఉంచే పెస్టిసైడ్స్‌ను చల్లిన దోమతెరలను జనానికి అందచేశారు. ఏదో ఒకసారి ఇచ్చి చేతులు దులుపుకోలేదు, ప్రతి మూడు నెలలకు ఒకసారి మందులను చల్లారు. మలేరియా సోకినవారికి చికిత్స చేసేందుకు సామాజిక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇదే విధంగా ఎయిడ్స్ నివారణా విషయంలో కూడా ఎలాంటి వ్యాక్సిన్లతోనూ పనిలేకుండానే ఎరిత్రియాలో 40శాతం ఇన్ఫెక్షన్లను తగ్గించారు. అమెరికాలో ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చాలా తక్కువ అయినా అక్కడి అనేక రాష్ట్రాలలో గర్భవతులైన మహిళలకు హెచ్ఐవి పరీక్ష చేయించుకోవటం తప్పనిసరి చేశారు. టెక్సాస్ రాష్ట్రంలో ఒక విద్యార్థికి పాఠశాల విద్య సమయంలో 68 వ్యాక్సిన్‌లు వేయటాన్ని తప్పనిసరి చేశారు. ఇదంతా నిజంగా ఆరోగ్యం కోసమా? ఔషధ కంపెనీల కోసమా? పులిని చూసి నక్కవాత పెట్టుకున్నట్లు ఇలాంటి అనవసర ఔషధాలు, వైద్యాన్ని మన జనంపై కూడా రుద్దుతున్నారు. అందుకే ఆసుపత్రి అంటే జనం భయపడుతున్నారు.

- సత్య

సీరియల్



జరిగినకథ:

హావ్‌కు వచ్చిన ఉత్తరంలో తన భర్త చనిపోయాడనే వార్త ఉంటుంది. అది చూసి ఆమె ఒక్కసారిగా గట్టిగా ఏడుస్తూ డువాంగును పట్టుకుంటుంది. "నీ భర్త వీరమరణం పొందాడు. దానికి గర్వపడాలి. చింతించాల్సిన పని లేదు" అని డువాంగ్ హావ్‌కు ఓదార్పుగా చెప్తుంది. ఈ విషయం తెలిసిన హావ్ మామయ్య పట్నం నుండి తిరిగి వస్తాడు. 'పాపను జాగ్రత్తగా పెంచు. ఆ బాధ్యతంతా నీదే. శత్రు వర్గాలలో ప్రచారం చెయ్యి' అని తన భర్త చెప్పిన మాటలే హావ్‌కు గుర్తుకు వస్తుంటాయి. దీంతో తన భర్త ఆశయాన్ని నెరవేర్చాలని నిశ్చయించుకుంటుంది. దాని గురించి ఆలోచిస్తూ నిద్రపోతుండగా ఆ రాత్రి ఒకతను వస్తాడు. తన భార్య ప్రసవ వేదన పడుతుందని హావ్‌ను కలవనియ్యమని మామాయ్యను అడుగుతాడు. కోడలు నిద్రపోతోందని, వేరొక మంత్రసానిని చూసుకోమని చెప్తాడు. అయినా అతను విడవకుండా మామయ్యను ప్రాధేయపడతాడు. దాంతో తప్పనిసరై 'హావ్ భర్త పోయిన దు:ఖంలో ఉంది. తాను రావడానికి కుదరదు' అని చెప్తాడు మామయ్య. అప్పడతను దిగులుగా వెనుదిరిగిపోతాడు. ఆ తర్వాత ...

మూలం: బుయ్‌డక్ ఆయ్

7వ భాగం

తెలుగు: కొల్లి సత్యనారాయణ

వియత్నాం గెరిల్లా

"వస్తున్నా! వుండు వుండు" అని కేక వేశాను.

మందుల సంచి కోసం చీకట్లో లోనికి వెళ్లాను. వెంటనే బయటికి వచ్చాను.

"నేను తప్పక వెళ్లాలి" అని మామయ్యతో చెప్పాను.

అప్పటికే బండి కొంచెం దూరంపోయింది. చీకట్లోనే బండి దగ్గరకు వెళ్లాను. నా కేక విని గుర్రాన్ని నిలబెట్టాడు. నేను పరుగెత్తుకు రావడం చూసి ఆశ్చర్యపోయాడు. మందుల సంచి అతని చేతికిచ్చి, బండి ఎక్కి కూర్చున్నాను. ఆశ్చర్యంతో నావంక చూశాడు. అతనిలో కోపం చల్లారింది. ముఖంలో సంతోషం చిందులాడింది.

"లోపలికి కూర్చో, లేకపోతే పడిపోతావ్" అని నమ్రతతో చెప్పాడు.

గుర్రంపై చెర్నాకోల చెళ్లుమంది. గుర్రం ఒకడుగు వెనక్కివేసి ముందుకు దూకింది. బండికి ఎర్రని దీపం కట్టివుంది. వర్షంలో బండి హోరుగాలిని చీల్చుకుంటూ వడివడిగా పోతోంది.

●●●

ఆమె చాలా గంటలు ప్రసవ వేదన పడింది. బిడ్డ "బొడ్డుపేగు" కోసి, కట్టుగట్టి, మిగిలిపోయిన 'మాయ' తీయడానికి ప్రయత్నించబోతున్నాను. చెవులు చిల్లులు పడేటట్లుగా దగ్గరలో హఠాత్తుగా శబ్దం విన్పించింది. అతనూ నేనూ చాలా భయపడ్డాం. "ఐరన్ బ్రిడ్జ్" క్యాంపును గెరిల్లాలు బాంబులతో ధ్వంసం చేస్తున్నారు. ఇంత గాలివానలో వాళ్లు ఎందుకు చేస్తున్నట్లు? నేనేం చేయాలి?" అంటూ అరిచాడు.

నాకేమీ పాలుపోలేదు. బాంబుల మోతతో పాటు, మర తుపాకుల కాల్పులు కూడా విన్పించాయి. "తుపాకులు కూడా పేలుస్తున్నారు. వర్షంలో తూటాలు 'బజ్'మంటూ పోతున్నాయి. కొన్ని తుపాకి గుళ్ల మేమున్న ఇంటి గోడలకు తగిలాయి. ప్రమాదం ముంచుకొచ్చింది. కాల్పులు ఆగినప్పుడు నేను తప్పించుకుని పోగలను. కానీ గుండు తగిలిందంటే నా బిడ్డనుండి దూరమైపోతాను. పారిపోవాలనుకున్నాను. కానీ వెళ్లలేకపోయాను. నాకంటే ఆమె ఎక్కువ భయపడింది. 'మాయ' తీసేయకముందే కాల్పులు ప్రారంభమయ్యాయి. బిడ్డ ఒంటినిండా ఉమ్మనీరు అంటుకుని వుంది. బిడ్డ వికారంగా తల ఆడిస్తోంది. మొదట భయపడ్డా తరువాత శబ్దానికి అలవాటు పడ్డాను. ధైర్యం చిక్కబట్టుకుని గుండ్లు దూసుకువచ్చే మార్గం తప్పించి మోకాళ్ల మీద కూర్చున్నాను. మాయను తీసేయడానికి ప్రయత్నించాను. "బ్లాక్‌హౌస్" నుండి ఆ మురా కాల్పులు సాగిస్తూనే వుంది. మాయను బయటికి తీసిన తర్వాత కొండంత బరువు దించినట్టయింది. కాల్పులు ఆగిపోయాయి. "గెరిల్లాలు వెళ్లిపోయి వుంటారు" అన్నాడు ప్రార్ధన చేస్తున్నట్లుగా చేతులు పెట్టి.

నేను నిద్ర లేచేసరికి తెల్లవారిపోయింది. ఆ రాత్రంతా తల్లీబిడ్డ హాయిగా నిద్రపోయారు. నేను వెళ్లడానికి సిద్ధం అయ్యేముందు, ఆమెకు ఏవిధంగా సహాయం చేయవలసిందీ వివరంగా అతనితో చెప్పాను. ఆరోజు వుండమని ఎంతో బతిమాలాడు. అన్నం, కోడికూర తెచ్చి తినమంటూ కూర్చున్నాడు. నేను నడిచి వెళ్తానన్నాను. అందుకు అతను అంగీకరించలేదు. వెళ్లడానికి బండిని సిద్ధం చేస్తుంటే నేను అభ్యంతర పెట్టాను.

"ఇంట్లో నువ్వు ఒక్కడివే వున్నావు. తల్లి, బిడ్డను చూడడానికి నువ్వు ఇక్కడే వుండాలి. నడిచి ఇంటికి వెళ్లగలను. మరేం పర్వాలేదు" అని ఎంతో శ్రమపడి ఒప్పించాను.

"మీకు ఎంతో రుణపడి వుంటాను. ఏదో ఒక రోజున మీ రుణం తీర్చుకుంటాను. ఈ దారిన పోతున్నప్పుడు మా ఇంటికి రావడం మర్చిపోకు. బండి తోలే 'హాయ్' అంటే ఎవరైనా చెబుతారు" అంటూ ఎంతో వినయంగా చెప్పాడు.

5

తర్వాత రోజుల్లో నేను పెద్దగా బాధపడలేదు. 'హీప్‌మీ' గ్రామంలో ఆ గాలివాన రాత్రి గుర్రబ్బండి డ్రైవరు ఇంట్లో గడిపిన విషయం గుర్తుకు వచ్చినప్పుడల్లా నాకు ఉత్సాహం, శక్తి వచ్చేవి.

తరువాత అనేక సందర్భాల్లో ఆ ప్రాంతానికి వెళ్లాను. ఆ విధంగా డువాంగ్‌కు చేసిన వాగ్దానం నేరవేర్చుకున్నాను. ప్రత్యేక లక్ష్యంతోనే నేను 'హాయ్' ఇంటికి వెళ్తూ వుండేదాన్ని. అవమానానికి గురై, ప్రతిఘటించకుండా బాధపడేవాళ్లు తెలివి తక్కువ వాళ్లని హాయ్‌కి, అతని భార్యకు

అర్థమయ్యేటట్లు చెప్పాను. నేను ఎన్నో బాధలు పడ్డాను. నన్ను నేను విముక్తి చేసుకునే మార్గం నాకు తెలియదు. అయితే నాకు నూతన శక్తి వచ్చింది. భయం పోయింది.

ఇంతకు ముందే నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరడానికి నా ప్రవర్తన ద్వారా ఒక అడుగు ముందుకు వేస్తానా? నా కృషికి ఇది దోహదపడుతుందని భావిస్తే సరియైనదే. ఇదొక పన్నుగడ అని భావిస్తే మాత్రం పూర్తిగా పొరపాటు. నేను సాధించదలచుకున్న కార్యం, నా మనస్సు ఒకే లక్ష్యంపై గురిపెట్టబడ్డాయి. హాయ్ ఇంట్లో సుమారు వారం రోజులు వున్నాను. కుటుంబంలో సభ్యురాలిగా చూశారు. ఆ దంపతులు తమ ప్రేమ వర్షాన్ని నాపై కురిపించారు. ప్రతి విషయంలోనూ నా సలహా తీసుకునేవారు. మంచి భోజనం పెట్టేవారు. బిడ్డ అనారోగ్యాన్ని గురించి చెప్పి, తన పాత జీవితానుభవాలను, ప్రస్తుత జీవన పరిస్థితులను చెప్పమని హాయ్‌ని ప్రోత్సహించేదాన్ని. తరువాత ప్రతిఘటనోద్యమాన్ని గురించి, హిప్‌మీ వంటి ఆక్రమిత ప్రాంతాల్లో పోరాట కేంద్రం ప్రాముఖ్యత గురించి వివరించేదాన్ని. అయితే చెప్పవలసిందంతా బలంగా చెప్పలేక పోయేదాన్ని. నాకేమో పని కొత్తది. మొత్తమ్మీద ఈ ప్రాంతం యెల్లకాలం ఇలా స్తబ్దుగా పడివుండదనీ, అందుకని ముందుగానే కీలక స్థానాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పాను. హాయ్ అర్థం చేసుకున్నాడు.

"ఇద్దరు దళ సభ్యులు వస్తున్నారు. వారికి రక్షణ ఇస్తావా?" అని చివరకు అడిగాను.

"ఎందుకివ్వను?" అని ఎదురు ప్రశ్నించాడు. నాకు సంతోషమేసింది.

"ఉద్యమాన్ని నిర్మించడంలో ప్రజలకు సహాయం చేయడానికై వారు వస్తున్నారు. మీ ఇంటికంటే రక్షణ స్థావరం మరొకటి లేదనుకుంటాను. నువ్వు, నీ భార్య వారికి సహాయం చేస్తారని నా విశ్వాసం" అన్నాను.

"వాళ్లెంతమంది?"

"ఇద్దరు"

"మంచిది"

"అయితే వారినెలా రక్షిస్తారు? ఎక్కడ దాస్తారు?"

"భయపడకు, ఇంట్లో వున్న నేల మాళిగ బాగుచేస్తాను. పగలు గదిలో వుంటారు. ఏదైనా ప్రమాదం వస్తే అందులోకి వెళ్తారు. రాత్రిళ్లు అక్కడే వుండడం క్షేమం".

నేలమాళిగను చూపించమని హాయ్‌ను అడిగాను. నన్ను గదిలోకి తీసుకెళ్లి, మూలనున్న పెద్ద బానను పక్కకు తొలగించాడు. లోనికి వెళ్లేదారికని బానను పక్కకు తొలగించాడు. లోనికి వెళ్లేదారి కనపడింది. ఇది పురాతన కాలం నాటిది. అందులోకి వెళ్లే మార్గానికి వంపులేమీ వుండవు. మా గ్రామంలోని నేల మాళిగ మాదిరిది కాదు. మామూలుగా బలవంతంగా పని చేయించడానికో, సైన్యంలోకో తీసికెళ్లడానికి శత్రువు వచ్చినప్పుడు తాత్కాలికంగా వీటిని ఈ ప్రాంతం వారు తప్పుకోటానికి ఉపయోగిస్తారట. "ఇది లాభంలేదు" అని వారితో చెప్పాను.

తరువాత మూడు రోజులుండి నేల మాళిగను మరమ్మత్తు చేయడంలో హాయ్‌కి తోడ్పడ్డాను.

హాయ్ భార్యకు ఆరుర్దా ఎక్కువైంది. ఆ విషయం సూటిగా చెప్పలేదు. కానీ రాత్రిపూట నా పక్కన కూర్చుని అనేక ప్రశ్నలు వేసేది. "తగిన జాగ్రత్తలు తీసుకుంటే చాలు. భయపడనక్కర్లేదు" అని ఆమెకు ధైర్యం చెప్పాను.

"ఇక్కడ ఆ పంది థామస్‌ను ఎప్పుడూ చూడాలని కోరుతున్నావా? వాడి తొత్తుల మూలంగా మన బిడ్డలు బాధపడకూడదని అనుకోవడంలేదా?" అని అడిగాను.

ఆమె మౌనం వహించింది. దీర్ఘాలోచనలో పడింది. అది అంత తేలికైన పనికాదు. గాలివానలో నిప్పు రాజేయడం ఎంత కష్టమో అవమానాన్ని భరించడానికి అలవాటు పడ్డ స్త్రీ హృదయంలో ధైర్యం పాదుకొల్పడం అంత కష్టం. అయినా తర్వాత అనేక సందర్భాల్లో ఆమె చేసిన సహాయం నన్ను చలింపజేసింది.

గాలివాన ఆగిపోవడంతో సముద్రంలోని కల్లోలం ఆగిపోయింది. ఉదయాన్నే నీటి అడుగు నుండి పైకి వచ్చి అలలపై పరుండి సూర్యుడి అలసట తీర్చుకుంటున్నాడా అన్నట్లుగా వుంది. మా ప్రాంతంలో సూర్యోదయం మహాద్భుతంగా వుంటుంది. చీకటి తెరలు తొలగి సముద్రం సూర్యకాంతితో వెలిగిపోతూ వుంటుంది. నాకు సూర్యోదయమైనట్లుగా వుంది. చీకటి మాదిరిగానే బాధలు తొలగిపోయి, వెలుగు మాదిరిగా నూతనోత్సాహం నా హృదయంలో వెలుగు నింపింది. పిల్లల పెంపకంలో తల్లులకు చాలా కాలం సహాయం చేశాను.

అనేక పర్యాయాలు సంతోషం, హాయి అనుభవించాను. నేను దెబ్బతిని విచారంలో మునగకముందే నా హృదయం ఆనందంతో నిండిపోయింది. ఈ సారి మాత్రం సంతోషం ఓదార్పు మాదిరిగా వచ్చింది. దృఢచిత్తం ఏర్పడింది. పని మూలంగా బాధ తగ్గుతుందని గ్రహించాను. బాధపడుతున్నప్పుడు లోగడ డువాంగ్ చేయి అందించినట్లుగా ఇప్పుడు వుంది.

ఆ రోజు డువాంగ్ రావాల్సి వుంది. ఆమె రాకకోసం ఆతురుతతో ఎదురు చూస్తున్నాను. పాప నిద్రపోతోంది. రొయ్యలు ఉంచిన కూజాలోని నీరు మార్చడానికి లోనికి వెళ్లాను. క్రితం రాత్రి వాటిని మామయ్య పట్టుకొచ్చాడు. వాటిలో పది రొయ్యలను బాగు చేస్తుండగా డువాంగ్ వచ్చింది. 'చాలా సేపటి నుండి నీ కోసం ఎదురు చూస్తున్నాను" అంటూనే, ఆమె వెనుక ఎవరున్నారని చూశాను. ఎవరూ లేకపోవడంతో "వాళ్లు రాలేదా?" అని అడిగాను.

డువాంగ్ నా దగ్గరకు వచ్చి కూర్చుంది. రొయ్యనొకదాన్ని పట్టుకుని తల, కాళ్లు తుంచుతూ "వచ్చారు. అయితే తెల్లవారు జాము నుండి 'హీప్'లో నుండి వచ్చిన తొత్తులు కాపలా వేశారు" అంది నెమ్మదిగా.

"ఎక్కడ?"

"బీచ్ రెండవ పక్కన వున్నారు. వాళ్లు ఎందుకు ఉన్నారో తెలియదు. అందుకని తాత్కాలికంగా 'టాట్' ఇంటివద్ద అట్టిపెట్టి వచ్చాను. వాళ్లు వెళ్లిపోగానే వారిని టాట్ ఇక్కడకు తీసుకొస్తాడు".

రొయ్యలను బాగు చేయడంలో డువాంగ్ తోడ్పడింది. ముందుగా బీచ్‌వంక చూసి, తరువాత ఆమె వైపు చూశాను. ఏమీ జరగలేదన్నట్లు ఆమె ప్రశాంతంగా వుంది. ఇటువంటివి ఆమెకు నిత్యానుభవమే. నాకు మాత్రం ఆందోళనగా ఉంది. లోలోన ఆమెను మెచ్చుకున్నాను. కొద్దికాలం గడిచిన తర్వాత వాళ్లిద్దరినీ వెంటబెట్టుకుని టాట్ వచ్చాడు. స్వాగతం చెబుతున్నట్లు చిరునవ్వు నవ్వాను. వాళ్లు దళ సభ్యులను ఎవరూ గుర్తుపట్టలేరు. ఒకతను వయస్సులో పెద్దవాడు. రెండవ వ్యక్తి యువకుడు. పెద్దతను నల్లని కోటు, తెల్ల ట్రౌజరు వేసుకున్నాడు. యువకుడు పాత చొక్కా వేసుకున్నాడు. పైపు కాలుస్తున్నాడు. ఇద్దరి వద్ద గోతాల మూటలు వున్నాయి.

దగ్గరకు వచ్చిన తర్వాత వారిని డువాంగ్ నాకు పరిచయం చేసింది. నమస్కారం చేశారు. నేనూ నమస్కరించాను. పెద్దవాని పేరు ట్రువాంగ్, చిన్నవాడి భుజం తట్టి ఇతను 'జంగ్' అని డువాంగ్ చెప్పింది.

జంగ్ నవ్వాడు. పైపును పళ్లతో గట్టిగా పట్టుకుని భుజాలు ఎగరేశాడు. గాలి విసురుకి చొక్కా పైకెరగడంతో కండరాలు తిరిగిన శరీరం బయటపడింది. స్వభావ సిద్ధంగా మంచివాడు. అయితే కొంచెం గర్వం లేకపోలేదు.

స్నేహితుల్ని చూసి మామయ్య సంతోషపడ్డాడు. టీ కాయడానికి వెళ్లాడు. టాట్ కొద్ది దూరం వెళ్లి తిరిగి వచ్చి,

"ఇద్దరు తొత్తులు వస్తున్నారు" అని హెచ్చరించాడు.

నాకు భయం వేసింది.

(తర్వాత ఏం జరిగింది? వాళ్లు వచ్చారా?)

(ఇంకా వుంది)

క్రైమ్ కథ

మళ్లీ గురి తప్పింది

- యర్నాగుల సుధాకరరావు

ఆ రాత్రి నిద్రపోతున్న సాగర్ పక్కనే కూర్చుని ఉన్న వృద్ధుడు తన గుడ్డసంచిలోంచి పిస్తోలు తీశాడు. సన్నగా నవ్వాడు. "సాగర్ ఆస్తి ఇవ్వరా అంటే ఆధారాలు చూపమంటావా? నాకున్న ఒక్కగానొక్క కన్నుకు ఉన్న చత్వారం వల్ల నిన్ను గురిచూసి కాల్చలేకపోయాను. ఇప్పుడు బయట ఏదో పెళ్లి టపాసులు పేలుతున్నాయి నా పిస్తోలు శబ్దం అందులో కలిసిపోతుంది" తలకు గురిచూసి కాల్చాడు. డామ్మంది.

"గురిచూసి పిస్తోలుతో కాల్చినా సాగర్‌కు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. వాడెవడో పిస్తోలు గురిపెట్టడంలో తడబాటు పడ్డాడు. కడుపులో దూరిపోవాల్సిన గుండు రాచుకుంటూ దూసుకెళ్లింది. అయినా రక్తసిక్తమైన గాయమైంది. దెబ్బతిన్న మరుక్షణం సాగర్ నేలమీద పడిపోయాడు. హంతకుణ్ణి పట్టుకోలేకపోయాడు. అతడెవరో తెలియకుండా పోయింది" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

ఎదురుగా నిలబడున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ "సార్ హంతకుడి గురి తప్పింది. చాలదగ్గర నుంచే కాల్చాడు. అప్పుడు సాగర్ అసలు కదలకుండా ఉన్నాడంట. హంతకుడికి కాల్చడం కొత్తనిపిస్తోంది. లేకుంటే ఏదో తెలియని గాబరా అతనిలో ఉంది. ఇవన్నీ కాకుంటే అతడికి ఏదో కంటికి పెద్దసైట్ లాంటిదైనా ఉండాలి" తనవంతు ఏదో ఒకటి చెప్పాలని కాకుండా ఆలోచించి మరీ చెప్పాడు.

"నీవు డిటెక్టివ్ నవలలు చదివి ఇలా తయారయ్యావు. ఇప్పుడు నీవు నాకు చెప్పావే అవేవీ మన పరిశోధనకు ఉపయోగపడవు. చదివే పాఠకుడికి థ్రిల్ కలిగించడానికి అలాంటి కోణాలు వెతుకుతుంటారు ఆ రైటర్స్. నువ్వు పోలీసువి, నీకు అలాంటి డ్రామాలతో కూడిన థ్రిల్లింగ్ కథనాలు వద్దు. నిజజీవితంలో అలా ఉండవు. ముందు కోలుకుంటున్న సాగర్‌ను కలుసుకుని అతడికి ఎవరెవరు శత్రువులున్నారో కనుక్కుని వాళ్లను మొత్తం వాన్‌లో వేసుకుని వచ్చావంటే ఇంటరాగేట్ చేసి హత్యాప్రయత్నం ఎవడు చేశాడన్నది కక్కిద్దాం" అని చెప్పి ఏదో ఫోన్‌వస్తే అందులో మునిగిపోయాడు.

యస్.ఐ బయటికి వచ్చి తిన్నగా హాస్పిటల్‌కు వెళ్లాడు.

అక్కడ పలువురు మీడియా వాళ్లు సాగర్ ముందు మైక్‌లు పెట్టారు.

కోలుకున్న సాగర్ వారికి ఓపిగ్గా చెబుతున్నాడు.

"మీకు ఎవరైనా శత్రువులున్నారా? ఎవరిమీద మీకు అనుమానం?"

"శత్రువులే లేరు. నేనెవరినీ అనుమానించలేను"

"మరి ఎందుకు చంపే ప్రయత్నం జరిగింది"

"పోలీసుల దర్యాప్తులో అన్నీ బయటికి వస్తాయి"

"మీకుగా మీరు ఏమీ చెప్పకపోతే పోలీసులు మాత్రం ఏంచేస్తారు?"

"ఎవరిమీద చెప్పగలను. నాకు ఈ మధ్య నా రక్త బంధువు ఒకరు ఎప్పుడో మా తాతలనాటి ఇంట్లో తనకు హక్కుందని వచ్చి అడిగాడు. నేను కుదరదు అని చెప్పాను. ఒకింత ఘర్షణ అయింది. ఆ చిన్నదానికే నామీద హత్యకు దిగడు. పైగా పెద్ద వయస్సు, అతడికి ఒక కన్నులేదు. ఉన్న కన్నుతో సరిగ్గా చూడలేడు. ఏదో ఆవేశంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయి అని మాత్రం తీవ్రంగా హెచ్చరించాడు"

యస్.ఐ వెంటనే అక్కడ ఉన్న పోలీసులను "ఇక్కడికి ఒంటి కన్నుతో ఉండే వృద్ధుడెవరైనా వచ్చారా?" అని అడిగాడు.

"వచ్చాడు. తన బంధువు సాగర్ గురించి వచ్చానన్నాడు. దూరం నుంచి చూశాడు. పాతకాలం నాటి బట్టలు వేసుకున్నాడు"

"ఎక్కడున్నాడు? ఏవైపుకు వెళ్లాడు?"

"అదిగోండిసార్ అక్కడ కూర్చున్నాడు" చూపించారు.

యస్.ఐ ఆ ఒంటికన్నువాణ్ణి పట్టుకుని మెల్లగా వాన్ వద్దకు నడిపించుకుని వెళ్లి అక్కడ అతడి జేబులు వెతికాడు. "ఏయ్ పోలీసు నన్ను వెతకవద్దు. పెద్దోళ్ల వద్ద పలుకుబడి ఉన్నోణ్ణి. ఏ కొండప్రాంతానికో బదిలీమీద పోగలవు" అని గుర్రెత్తిపోయాడు.

అతణ్ణి వ్యాన్ ఎక్కించుకుని తీసుకెళ్లి ఇన్‌స్పెక్టర్ ముందు నిలబెట్టాడు.

విషయం విన్న ఇన్‌స్పెక్టర్ "నీకు మరెవ్వరూ దొరకలేదా? కాటికి కాళ్లు జాపుకున్నవాణ్ణి వేసుకుని వచ్చావు. ఇతగాడెందుకు సాగర్‌ను ఖూనీ చేస్తాడు. పిస్తోలు వెతికినా దొరకలేదని చెబుతున్నావు. అది మార్కెట్‌లో దొరికే చవకబారు వస్తువు కాదే, ప్రతివాడు ఒక పిస్తోలుతో తిరగడానికి. నీకు డిటెక్టివ్ నవల పిచ్చి బాగా ఉంది. పనంతా చెడగొడుతున్నావు. అతణ్ణి తీసుకుపోయి ఎక్కడ దించమంటాడో అక్కడ దించేయ్" చెప్పి పంపేశాడు.

యస్.ఐ ఉసూరంటూనే వాన్ ఎక్కించుకుని బయల్దేరాడు. ఏమయ్యా డ్యూటీకి కొత్తేమిటి? నేను నీకు చంపేటోడిలా కన్పిస్తున్నానా? సాగర్ నాకు ఎంత కాదనుకున్నా నారక్తసంబంధీకుడు. మా తండ్రి నుంచి వస్తోంది ఆస్తులపోరాటం. సరే ఇక్కడ ఆపేయ్, అన్నట్టు ఆసుపత్రిలో ఆ పోలీసులకు చెప్పవయ్యా నేను సాగర్‌కు సేవలు చేసుకోవాలి" చెప్పి కిందకు దిగిపోయాడు.

యస్.ఐ ఆ వృద్ధుణ్ణే చూశాడు. అతడు అధికారుల దగ్గర నడిచేలా మెల్లగా నడవడంలేదు. వేగంగా ఏదో సాధించేవాడిలా నడుస్తున్నాడు. తాను ఏది చెప్పినా డిటెక్టివ్ నవల పరిజ్ఞానం అంటున్నాడు. 'ఎలా ఈ ఇన్‌స్పెక్టర్‌తో' అని తలపట్టుకున్నాడు.

ఆ రాత్రి నిద్రపోతున్న సాగర్ పక్కనే కూర్చుని ఉన్న వృద్ధుడు తన గుడ్డసంచిలోంచి పిస్తోలు తీశాడు. సన్నగా నవ్వాడు. "సాగర్ ఆస్తి ఇవ్వరా అంటే ఆధారాలు చూపమంటావా? నాకున్న ఒక్కగానొక్క కన్నుకు ఉన్న చత్వారం వల్ల నిన్ను గురిచూసి కాల్చలేకపోయాను. ఇప్పుడు బయట ఏదో పెళ్లి టపాసులు పేలుతున్నాయి నా పిస్తోలు శబ్దం అందులో కలిసిపోతుంది" తలకు గురిచూసి కాల్చాడు. డామ్మంది.

బయట పొంచున్న పోలీసులు గాబరగా లోపలకు వచ్చారు. అప్పటికే సాగర్ మెడచివర గాయమై రక్తం కారసాగింది. అక్కడ పొగలు చూసి ఎవరు కాల్చారా అని చూశారు. బ్యాక్‌డోర్‌లోంచి పారిపోతున్న వృద్ధుణ్ణి పట్టుకున్నారు.

మళ్లీ గురితప్పింది. ఒంటికన్నుకున్న చత్వారం వల్ల అతడు కాల్చడంలో రెండోసారి గురి తప్పాడు.

ఇన్‌స్పెక్టర్ గాఢంగా నిట్టూర్చి యస్ఐను అభినందించాడు. నీ డిటెక్టివ్ నవలా పరిజ్ఞానం కరెక్టుగానే ఉంది. బాగానే చెప్పావు. సాగర్ మరోసారి బతికి బట్టకట్టాడు. లేకుంటే ఎంత ప్రమాదం? మాటపడిపోయేవాళ్లం. దేన్నీ తక్కువ అంచనా వేయరాదు అని తెలుసుకున్నాననుకున్నాడు ఇన్‌స్పెక్టర్.

★

తెలుసుకుందాం...

మ్యాజిక్ ముచ్చట్లు



ఒకతను మద్దెల వాయించినప్పుడు అసాధారణ నైపుణ్యంతో కాని వాయిస్తే అతను ఒక సాధారణ తబలా వాద్యకుడుగానే ఉండదు. ఆయన చేతుల్లో 'మ్యాజిక్ (ఇంద్రజాలం)' జరుగుతుంది. ఆయన మద్దెల 'ఇంద్రజాలకుడు' అయిపోతాడు. ప్రతి కళాకారుడి విషయంలోనూ ఇది వర్తిస్తుంది. ప్రతి ఒక్కరూ ఎవరి వృత్తిలో వారు 'ఇంద్రజాలకుడు' అవ్వాలని అనుకుంటారు. కాని అందరూ ఆ స్థాయిని చేరుకోలేరు కదా! అయినా చేరుకోవాలని అందరూ కలలు కంటారు. కొన్ని కొన్ని సందర్భాల్లో కొంతమంది వ్యక్తులే ఆ నైపుణ్యాన్ని అందుకుంటారు. అప్పుడు వాళ్లని కూడా వాళ్ల ఆ జగుత్తు 'ఇంద్రజాలకులు' అంటాం. ఈ విధంగా మనం మన సమాజంలో హాకీ ఇంద్రజాలకులు, క్రికెట్ ఇంద్రజాలకులు, చిత్రకళ ఇంద్రజాలకులు... ప్రముఖులైన విభిన్న 'ఇంద్రజాలకుల'ను పొందాం.

ప్రతి మనిషిలోనూ అసంభవాన్ని సంభవం చేసి చూపించాలనే ఒక కల లేక వాంఛ ఉంది. పాకుతున్న పసివాడైనా, పెన్షన్ పుచ్చుకుంటున్న పెద్ద మనిషైనా అసంభవాన్ని సంభవం చేసి చూపించాలనే – ఆ ఇంద్రజాలక ప్రవృత్తి ప్రతి ఒక్కరిలోనూ ఉంది. పిల్లవాడు కళ్లజోడు లాగేసుకుని వెనుక పెట్టుకుని 'లేదు, లేదు' అన్నప్పుడు అది వాడి మాయం చేసే ఎత్తుగడ, మొదటి ప్రయోగం, మ్యాజిక్. కిటికీలోంచి మొట్టమొదట ఏదైనా వస్తువు పారేసి 'మాయం' చేసే మ్యాజిక్‌ను ప్రతి పిల్లవాడు చూపిస్తూ ఉంటాడు. ఈ 'మ్యాజిక్' చూపించే ప్రవృత్తిలోనే కనపడుతుంది. చిరకాలం ఉండే ఒక ఇంద్రజాలం భావం ప్రతి మనిషిలోనూ దాగి ఉంది. శాస్త్రం వివిధ రహస్యాలు తెలుసుకుని పట్టు సాధించడం ద్వారా ఆ ఇంద్రజాల భావం, శాస్త్ర చైతన్యం బయట పడతాయి. ఈ విధంగానే మనిషి ముందుకు సాగుతాడు. మెల్లమెల్లగా 'మ్యాజిక్' శాస్త్రంగా మారుతుంది. అందుకే నేనంటాను, ఈ రోజు మ్యాజిక్కే రేపటి శాస్త్రం, ఈ రోజు శాస్త్రం గతకాలపు మ్యాజిక్. ఒక మొబైల్ కెమెరా, టేప్‌రికార్డర్ తీసుకుని, మరీ ఎక్కువ పాత కాదు, సిరాజుద్దౌలా లేక లార్డ్ క్లైవ్ ఎదుట ఏదోలా హాజరు అయ్యానని ఫొటో తీసి, వారి మాట రికార్డు చేసి, సిడి వాయించి పాట వినిపించి లేక వీడియో నడిపి వారి ప్రోగ్రామ్ ప్లే బ్యాక్ చేసి చూపించానని అనుకుందాం. అలా జరిగితే వారు మమ్మల్ని సాధారణ మానవులుగా భావించరు. 'ఇంద్రజాలకులు' అనుకుంటారు. అద్భుతమైన ఇంద్రజాలం చేస్తున్నామని అనుకుంటారు. సమాజంలో శాస్త్ర చైతన్యం పెరుగుతున్న కొద్దీ ఈ మ్యాజిక్కుల మోజు కూడా తగ్గిపోయింది. ఇప్పటికీ పోతోంది. మ్యాజిక్ ఇప్పుడు ఆ అర్థంలో మ్యాజిక్ కాదు. ముందుకు పయనించే శాస్త్రానికి ముందటి ఆలోచన అయిపోయింది. దాని పద్ధతులు తెలిసినా తెలీకపోయినా, శాస్త్రం ద్వారా అసంభవాన్ని సంభవం చేయొచ్చు అనేది మనం మెల్లమెల్లగా ఒప్పేసుకున్నాం.

కానీ అన్ని అసంభవాలను సంభవం చేయడం సాధ్యమా? దీనికి సంబంధించి నానా మునుల నానా అభిప్రాయాలు. 'అసంభవం' పదం ప్రత్యేకత ప్రతినిత్యం మారిపోతోంది. కొన్ని దేశాల్లో మెల్లగా మారుతోంది. కొన్ని దేశాల్లో వేగంగా, గబగబా. ఐతే ఒకటి, ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యుగంలో, ఇంటర్నెట్ పుణ్యమా అని మనం గబగబా అభిప్రాయ మార్పిడి, సమాచారం ఇచ్చి పుచ్చుకోవడం చేసి విద్యా విషయంలో ఒక సమాన స్థాయికి చేరుకుంటున్నాం. అంతా తెలుసుకున్నాం మనం– కానీ ఇబ్బందులు ఎదురౌతున్నాయి. అది చేసి వాస్తవరూపం దాల్చేటప్పుడు లేక పనిచేసి చూపించేటప్పుడు. ఏదైనా కొత్తది చేయాలంటే పాతదాన్ని భగ్నం చేయాలి. ఆ భగ్నం చేయడంలోనే ఉంది కొత్తదాన్ని సృష్టించే అంగీకారం. ఐతే సంతోషకర విషయమేమంటే మన దేశంలో కొత్తదాన్ని నిర్మించడానికి, పాతదాన్ని భగ్నం చేయడానికి ఇబ్బంది తక్కువ. కారణం! చేసి చూపించడానికి జాగా మనకు ఎంత విస్తృతం అంటే పాతదాన్ని గౌరవిస్తూనే, దాన్ని దాని జాగాలోనే ఉంచి, కొత్తదాన్ని కొత్త మనుసులో నిర్మలమైన జాగాలో నిర్మించగలం. పాత నగరాన్ని కూలగొట్టి కొత్త నగరం నిర్మించడం కన్నా ఖాళీ జాగాలో కొత్త నగరం నిర్మించడం చాలా సులువైనట్టు. మన దేశంలో ఆ వెసులుబాటు ఉంది. అందుకే నేను అంత ఆశావాది. మన సాంప్రదాయం మర్యాద పూర్వకంగా ఉంచుతూనే దాని పక్కనే కొత్తదానికి జాగా చేసి పెట్టడం చాలా సులభం. అదే జరిగేలా చేయాలి, జరుగుతోంది.

మ్యాజిక్ చూపిస్తున్నప్పుడు నేరుగా ప్రేక్షకుల తెలివి, ఆసక్తి, చైతన్యం, స్పర్శ నాకు అందుతూ ఉంటుంది. సినిమా, టెలివిజన్, ముద్రణాక్షరాల ప్రపంచంలోకి నేరుగా ప్రేక్షకులతో సంయోగం అనేది అంతగా ఉండదు. నాటకంలో కూడా మ్యాజిక్‌లో ఉన్నంత ఉండదు. కారణం ప్రేక్షకుల తక్షణ అభిప్రాయం నాటకం కథని స్పృశించలేదు. ప్రేక్షకులు అక్కడ మాత్రమే. వేదికకు ప్రతిపాదన నివేదించే అవకాశం వారికి లేదు. వారి అభిప్రాయం నాటక కథాంశాన్ని మార్చలేదు. కానీ మ్యాజిక్ విషయంలో అలా కాదు. ప్రేక్షకులు అప్రమత్తంగా వెల్లడించిన అభిప్రాయాల్లోనే ఉంది ఇంద్రజాలకుడి సాఫల్యం. ఒక డబ్బాని మూతవైపు ఖాళీ చేస్తే నాటక ప్రేక్షకులు దాన్ని మరోవైపు ఖాళీ అని ఒప్పేసుకుంటారు. అది అసలు అలా లేకపోయినా ఏమీ కాదు. ప్రేక్షకులు రసాన్ని అందుకోగలరు. ఛందస్సుకు భంగం వాటిల్లదు. కానీ మ్యాజిక్ విషయంలో అలా కాదు. ఇక్కడ డబ్బా మూతవైపు ఖాళీ ఉన్నట్టు చూపించాల్సిందే. ప్రేక్షకుల అప్రమత్త సంతృప్తి, ఆ ఖాళీ చూసినట్టు ధృవీకరణతో మ్యాజిక్‌ని కేవలం కథా నాట్యరూపం చేయకుండా దానికంటే ఇంకా పైకి వెళ్లి అసంభవానికి నాట్యరూపం ఇచ్చి నమ్మదగినదాన్ని కేవలం నాటకీయంగా కాకుండా, శాస్త్ర సమ్మతంగా ప్రతిష్ఠింపచేయాల్సి ఉంటుంది. ఈ కారణంగానే సాఫల్యం పొందిన సరియైన ఇంద్రజాల కళాకారుల సంఖ్య ఇంత తక్కువ. ఇంద్రజాలకుడు ఒక అభినేత ఆయన ఇంద్రజాలకుడి పాత్రలో అభినయం చేస్తాడు. కానీ ఆ అభినయం కేవలం సాహిత్యధర్మి కాదు, వాస్తవాన్ని స్పృశించి సక్రమంగా శాస్త్రసమ్మతంగా 'నిజం'గా చేయాల్సి ఉంటుంది.

ఎన్నో పెద్ద పెద్ద మాటలు రాసేశాను. ఇవన్నీ మ్యాజిక్ తాత్విక చర్చ. దీని గురించి జనాలు పెద్దగా చర్చించరు. అందుకే చాలా మందికి ఇదంతా తెలియని విషయం. తెలియకుండానే వారు నానా రకాల వాఖ్యలు చేస్తుంటారు. ఆ కారణంతోనే నేను మీతో, పిల్లలతో ఇవన్నీ చర్చకు పెట్టాను. మీరు కొత్త యుగం, కొత్త ఆసక్తి, కుతూహలం గల మనుషులు. మీరు ఈ మాటల్ని సరిగ్గా అర్థం చేసుకోగలుగుతారు. ఆలోచనలు అంతరించి, జంకు పట్టిపోయిన బుద్ధిగల ఆ మనుషులందరికీ ఇవి అర్థం కావు. వారి బుర్ర నిండా కేవలం పాత సరుకే. అందుకే మీరు చూస్తారు, మ్యాజిక్ అనే మాట రాగానే వారు అంటారు 'మ్యాజిక్కా! అది పిల్లల కోసం'. వారు చెప్పేది నిజమే. మ్యాజిక్ అనేది గతించిన, ఓడిపోయిన వారి కోసం కాదు. కుతూహలం గల మనుషుల కోసం. ఇంకా దృష్టి సారించి చూడండి, మ్యాజిక్ చూడడానికి వారి సందోహమే ఎక్కువ. వారే టికెట్ల కోసం కొట్లాడుకుంటారు. తోసుకుంటూ తన్నుకుంటూ వారే ముందుకు ఎగబడతారు. కారణం? అవును. ఒక మంచి అద్భుతమైన కారణం ఉంది. వారే మళ్లీ చిన్న పిల్లల్లా అవ్వాలనుకుంటారు. మ్యాజిక్ పిల్లల కోసం కాదు. మ్యాజిక్ మనిషిని 'పిల్లాడి'గా మార్చివేయడం కోసం.

- పిసి సర్కార్ (జూనియర్)

చూద్దామా

నేల తల్లికి పూల 'కడియం'

నర్సరీలకు పుట్టినిల్లు-సందర్శకులకు మెట్టినిల్లు ఈ కడియం నర్సరీలు. ఇక్కడి నర్సరీలంటే తెలియని వారుండరు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన ఈ నర్సరీలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. కాలాలతో పనిలేకుండా నిత్యం పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. అవే తూర్పు గోదావరిజిల్లా కడియం నర్సరీలు.

మూడు తరాల క్రితం మండల కేంద్రమైన కడియంలో ప్రారంభమైన మొక్కల పెంపకం నేటికి కడియపులంక, బుర్రిలంక, పొట్టిలంక, వెంకాయమ్మపేట, దామిరెడ్డిపల్లి, వీరవరం, వేమగిరి గ్రామాలకు విస్తరించింది. ఆనాటి నుంచి నేటి వరకూ రైతులు కన్నబిడ్డలపై పెంచుకోలేని మమకారాన్ని ఆ మొక్కలపై పెంచుకున్నారు. పసిబిడ్డకన్నా అపురూపంగా లాలించి పెంచి పెద్ద చేసిన ఆ మొక్కలు ఇక్కడి రైతులకు దూరం కావు. ఇక్కడి రైతుకీ, మొక్కకీ ఉన్న అనుబంధం అటువంటిది. చారిత్రక రాజమహేంద్రి నగరానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలోనే ఈ నర్సరీలున్నాయి. సుమారు 10 వేల ఎకరాల్లో చిన్నా, పెద్దా కలిపి సుమారు రెండు వేల నర్సరీలు విస్తరించి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల నుంచే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తున్నారు. ఇక్కడకొచ్చిన పర్యాటకులకు నర్సరీలు ఎంతగానో సేదతీరుస్తాయి. ఎంతగానో ఆకర్షించి ముగ్ధులను చేస్తాయి. ఎక్కడా లభించని నాణ్యమైన రకరకాల పూల మొక్కలను అందించగల ప్రదేశంగా గుర్తింపు తెచ్చుకుంది.

మూడు తరాల క్రితం నాంది

పూలు, పండ్ల మొక్కలను వ్యాపారపరంగా మలచిన రైతు రావు చెన్నారావు. ఆయన ఇతర నగరాలనుంచి మొక్కలను తెచ్చి ఉభయ గోదావరి జిల్లాల్లో వ్యాపారాన్ని ప్రారంభించారు. మొక్కల వ్యాపారం ద్వారా జీవనోపాధిని పొందవచ్చునని అప్పట్లోనే నిరూపించి సాటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఆ తర్వాత ఆకుల సుబ్బారావు అనే రైతు పూల మొక్కల వ్యాపారాన్ని నలుదిశలా వ్యాపింప చేశారు. నర్సరీల వ్యవస్థకు అంకురార్పణ చేశారు. వీరిని ఆదర్శంగా తీసుకుని అనేక మంది రైతులు తమకున్న పొలాల్లో పూల మొక్కలను పెంచుతూ నర్సరీల వ్యవస్థను మరింతగా అభివృద్ధి చేశారు.

ప్రారంభంలో అవస్థలు

అప్పట్లో విద్యుత్, రోడ్లు, రవాణా సౌకర్యాలు లేక రైతులు అనేక అవస్థలు పడ్డారు. బావి నీరే గతి. మొక్కలను పెంచడం ఒక ఎత్తయితే, వాటిని ఇతర ప్రాంతాలకు తరలించడం మరో ఎత్తుగా ఉండేది. రోడ్లు, వాహనాల సౌకర్యం లేకపోవడంతో కాలినడకన, పడవలపైనా వీటిని తరలించేవారు. అప్పట్లో రైతులకు ఎటువంటి శాస్త్రీయ శిక్షణ లేనప్పటికీ తమకున్న బుద్ధిబలంతోనే మొక్కలను పెంచారు. క్రమేపీ అన్ని రకాల వసతులు అందుబాటులోకి రావడంతో నర్సరీ రైతులు కాలానుగుణంగా వ్యాపారాలను మలచుకుని అభివృద్ధి సాధించారు. రెండు దశాబ్దాలుగా నర్సరీ పరిశ్రమ అంచెలంచెలుగా ఎదుగుతూ వేలాది రకాల ఫల, పుష్ప మొక్కలను సృష్టిస్తున్నారు.

నిరంతర ప్రయోగశాల

ఇక్కడి నర్సరీలు నిరంతర ప్రయోగశాలలుగానే కన్పిస్తాయి. కొత్త కొత్త మొక్కలను రూపొందించడంలో ఇక్కడి రైతులే శాస్త్రవేత్తలు. తొలిదశలో లభించే మొక్కలనే ప్రయోగాలు చేసి రైతులు పరీక్షిస్తారు. నర్సరీ రైతులకు ప్రభుత్వం శాస్త్రీయ విజ్ఞానాన్ని అందించకపోయినా వారి సొంత పరిజ్ఞానంతోనే అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. ప్రకృతిలో సహజసిద్ధమైన ఫల, పుష్పాలను వాటి ఆకార పరిణామాలను రైతులు అంచనా వేసి, మొక్కలను మార్పు చేస్తుంటారు. ఇతర ప్రాంతాల్లో లభించే ఖరీదైన ఆకర్షణీయమైన ఫలపుష్ప మొక్కలను తీసుకొచ్చి అంటుకడతారు. బెంగుళూరు, త్రివేండ్రం, కలకత్తా, మద్రాసు, గుజరాత్, బొంబే, కాశ్మీర్ వంటి ప్రాంతాల నుంచి మొక్కలను తెచ్చి ఇక్కడి నర్సరీల్లో అభివృద్ధి చేస్తారు. ఆ మొక్కల ప్రయోగం విజయవంతమైతేనే వాటిని విస్తరింప చేయడానికి ప్రయత్నాలు చేస్తారు.

కొత్త కొత్త ఫల, పుష్పాలు

నర్సరీల రైతుల పరిజ్ఞానంతో కొత్త కొత్త ఫల, పుష్పాలు ఉత్పత్తి అవుతున్నాయి. క్రోటాన్, లాన్స్, ఇపార్బియా, దురంత రకాలతోపాటు, ఆర్నమెంటల్ వంటి రకాల మొక్కలు నర్సరీ రైతుల చేతుల్లో రూపుదాల్చుతున్నాయి. లాన్స్‌లో దురంత గోల్డు, ఆల్టానంత్ర, ఐరిషియా, ఆకేలిషా, లాన్‌గ్రాస్, లేంతటాన్ వర్చేనా, ఫైకాష్ రకాలు లభిస్తాయి. పూల మొక్కల్లో థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లాడ్, జర్మనీ దేశాల నుంచి దిగుమతి చేసి ఆ మొక్కలను అభివృద్ధి చేయడం ఇక్కడి రైతుల ప్రత్యేకత. ముఖ్యంగా విదేశాల నుంచి టేకొమా, టికొమాపర్పల్, టేకొమా కెపాన్సీ, గల్ఫ్‌మయా, టాచ్ బ్లూ, శ్రీలంక జాష్మన్ పుష్పాలు దిగుమతి అవుతున్నాయి. ఫామ్స్ రకాల్లో బిష్మాక్యా సిల్వర్,

పామ్స్టైల్, ఛాంపియన్, ట్రింగిల్, మస్కరినా, వెటానయా రూబ్రా, హెచ్‌మేరీ గోల్డ్, సైకాస్, సయోగ్రాస్ ఫాన్, మెటాలికో, బిందు, కేలటీయ, రాయల్, షో పర్పస్ వంటి రకాల మొక్కలు గృహ అలంకారాలకు వినియోగం అవుతుంటాయి. పండ్లకు సంబంధించి మామిడి, జామ, బత్తాయి, నిమ్మ, సపోటా, అరటి రకాలకు ఇక్కడి నర్సరీలు పెట్టింది పేరు. అందరినీ ముగ్ధులను చేసే ఎరుపు, తెలుపు, గులాబి, పసుపు రంగుల గులాబీలు, సుగంధ పరిమళాలను వెదజల్లే సంపంగి, ఎగ్ సంపంగి, నందివర్ధన, నైట్‌క్వీన్, రెడ్ నైట్‌క్వీన్, లెగ్‌స్టోమియా పింక్ రకాలు కనులకు ఇంపుగా కన్పిస్తాయి. అలాగే ముద్దమందారం, ముద్దబంతి, చామంతి, కనకాంబరం వంటి పుష్పాల మొక్కలు దర్శనమిస్తాయి.

కనువిందు చేసే ఫలపుష్ప ప్రదర్శనలు

ప్రతి ఏడాది జనవరి నెలలో కడియపు లంకలో నిర్వహించే ఫలపుష్ప ప్రదర్శనలు కనువిందు చేస్తాయి. ఈ సందర్భంగా పూలమొక్కలు, ఇంటీరియర డెకరేషన్ మొక్కలను ప్రదర్శించి సందర్శకులను ఆకర్షిస్తూ ప్రజాభిమానాన్ని ఇక్కడి రైతులు అందుకుంటారు. 1999లో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సతీష్‌చంద్ర ఇక్కడి నర్సరీలను చూసి ముగ్ధుడయ్యారు. దీంతో మొదటిసారిగా కడియపులంకలో ఫలపుష్ప ప్రదర్శనను ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆనాటి నుంచి నేటి వరకూ ప్రతి ఏడాది జనవరి నెలలో ఈ కార్యక్రమాన్ని నర్సరీ రైతులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనల్లో ఎవరికి వారే పోటీపడుతూ వినూత్నమైన పద్ధతిలో వేలాది రకాల పూలమొక్కలు, అరుదైన ఇంటీరియల్ డెకరేషన్ మొక్కలను ప్రదర్శించి తమదైన నైపుణ్యాన్ని చాటి చెప్పి సందర్శకులను ఆకట్టుకుంటారు. సుమారు 7 ఎకరాల విశాలమైన స్థలంలో ఈ ప్రదర్శన కోసం ఏర్పాట్లు చేస్తారు. ఈ ప్రదర్శన కోసం రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా, దేశవ్యాప్తంగా సందర్శకులు ఉత్సాహంగా పాల్గొంటారు. ఇదేరీతిలో జాతీయ స్థాయి ఫలపుష్ప ప్రదర్శనలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. 2003లో జాతీయ స్థాయి ప్రదర్శనలకు కడియపు లంక వేదికగా నిలిచింది. ఈ జాతీయ ప్రదర్శనలకు ఇక్కడి రైతులతోపాటు, ఉత్తరప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, కర్నాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, కాశ్మీర్ వంటి ప్రాంతాల నుంచి పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

కడియపులంకలో పూల మార్కెట్

ఇక్కడి పూల మార్కెట్ ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచే ప్రారంభమౌతుంది. ఎక్కడ చూసినా వివిధ రకాల పూలరాశులే కన్పిస్తాయి. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఒకటే సందడి వాతావరణం కన్పిస్తుంది. ఒకపక్క పూల రాశులు పోస్తుండగానే మరోపక్కన ఇతర ప్రాంతాలకు తరలించేందుకు పార్శిల్స్ అవుతూనే ఉంటాయి.

వాతావరణాన్ని బట్టి ధరల మార్పులు

ఇక్కడి పూల మార్కెట్ ధర వాతావరణాన్ని బట్టి మారిపోతుంది. ఈ మార్కెట్‌లో ఎరుపు, తెలుపు, గులాబి, పసుపు రంగుల గులాబీలు, సుగంధ పరిమళాలను వెదజల్లే సంపంగి, ఎగ్ సంపంగి, నందివర్ధన, నైట్‌క్వీన్, రెడ్ నైట్‌క్వీన్, లెగ్‌స్టోమియా పింక్ రకాలు, అలాగే ముద్దమందారం, ముద్దబంతి, చామంతి, కనకాంబరం వంటి పుష్పాలు అమ్మకాలు జరుగుతాయి. ఈ పువ్వులన్నీ ఆయా కాలాలను బట్టి లభ్యమౌతాయి. అయితే మల్లె, గులాబీలు, సంపంగి, చామంతి, కనకాంబరం రకాల పువ్వులు అమ్మకాల్లో అప్పటికప్పుడే ధరల్లో మార్పు చేసుకుంటాయి.

సినీ, బుల్లి తెర చిత్రాల షూటింగులకు కొదవలేదు

ఇక్కడి నర్సరీలు కేవలం సందర్శకులకే పరిమితం కాలేదు. సినీ, బుల్లి తెర చిత్రాల షూటింగుల స్పాట్‌గానూ పేరు ప్రఖ్యాతలు అందిపుచ్చుకుంది. ఎన్టీఆర్, ఎఎన్ఆర్, కృష్ణ, శ్రీదేవి వంటి అలనాటి సినీ హీరో, హీరోయిన్‌ల నుంచి నేటి తరం హీరో హీరోయిన్లు బాలకృష్ణ, నాగార్జున, ఇతర చిన్నా, పెద్దా హీరోలు, హీరోయిన్ల చిత్రాలు ఇక్కడే జరిగాయి. శ్రీ సత్యనారాయణ నర్సరీ గార్డెన్ యజమాని పల్లా వెంకన్న నర్సరీలో ఏకంగా 150 చిత్రాలకుపైగానే షూటింగులు జరిగాయి.

పర్యాటక ప్రాంతమైనా సౌకర్యాలు నిల్

జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న ఇక్కడి నర్సరీలు పర్యాటక ప్రాంతంగా వర్ధిల్లుతోంది. 1250 ఎకరాలకుపైబడి 250 నర్సరీలు ఉంటే పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేస్తామని పాలకులు గతంలో ప్రకటించారు. ఈ ప్రకటనలు చేసి దశాబ్దకాలం అవుతున్నా నేటికీ ఆ నేతల మాటలు అమల్లోకి మాత్రం రాలేదు. అయినా ఈ ప్రాంతం పర్యాటకులతో నిత్యం కన్పిస్తోంది. అయితే పర్యాటకులు ఇక్కడ విడిది చేసే సౌకర్యాలు కల్పించడంలో పర్యాటక శాఖ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. ఎంతో అహ్లాదకరమైన వాతావరణం, ఎన్నెన్నో ప్రకృతి సోయగాలు ఉన్నా వాటిని తిలకించి, ఆస్వాదించేందుకు మాత్రం అవకాశాలు కల్పించడం లేదు. ఇక్కడి అందాలను తిలకించాలంటే ఇటు రాజమండ్రి, అటు రావులపాలెం కేంద్రాలుగానే రాత్రి బస చేయాల్సిన పరిస్థితి కన్పిస్తోంది.

తీరని కోరిక

దశాబ్దకాలంగా ఇక్కడి నర్సరీ రైతుల కోరిక తీరడం లేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నాణ్యతా ప్రమాణాలు కల్గివున్న కడియం నర్సరీలకు విదేశీ ఎగుమతులను ఇక్కడి రైతులు నేరుగా ఎగుమతి చేసుకునే వెసులుబాటు కానరావడం లేదు. గత దశాబ్దకాలంగా ఇక్కడి రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నారు. కానీ వారి విజ్ఞప్తులు మాత్రం ప్రభుత్వానికి వినిపించడం లేదు. ఎంత కష్టించి కొత్త కొత్త రకాల మొక్కలను ఉత్పత్తిచేసినా తగిన ఎగుమతి సౌకర్యం వీరికి దక్కడం లేదు. దేశీయంగా మంచి పేరును సంపాదించిన రైతులకు విదేశాల్లోనూ ఆ పేరు పొందాలన్నదే వీరి ఆశ. అయితే బెంగుళూరు, మద్రాసు, కలకత్తా నగరాలకు చెందిన కొందరు దళారులు ఇక్కడ నుంచి తీసుకెళ్లి విదేశాలకు ఎగుమతి చేసుకుంటున్నారు.

-ఎన్.రాంబాబు, రాజమండ్రి



కొత్త పుస్తకాలు

సీమ సాహిత్య రత్నాలు



'సీమ సాహిత్య రత్నాలు'
రచన : డా॥ కొత్వాలు అమరేంద్ర,
పేజీలు : 190, వెల : 100/-,
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
విజ్ఞాన్‌భవన్ - 4-1-435, బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాద్-500001.

డా॥కొత్వాలు అమరేంద్ర "రేఖామాత్రంగా" అంటూ తొలి పలుకుల్లోనే అసమగ్రతను అంగీకరించడం బాగానే వుంది కానీ... ప్రముఖుల... నిరంతర సాహిత్య సేవ, సాంస్కృతిక సేవ చేస్తున్న వారిని పేర్కొనకపోవడం విస్మయం కలిగిస్తోంది.

ఉదాహరణకు కడపలో బ్రౌన్ గ్రంథాలయ నిర్వహణ, సాహిత్య వ్యాసంగం సాగించే జానమద్ది హనుమఛ్ఛాస్త్రి, ఔత్సాహిక కవుల్ని ప్రోత్సహిస్తూ సీనియర్ పాత్రికేయులుగా వుండి పత్రిక సంపాదకులుగా వ్యవహరిస్తున్న శశిశ్రీ, ప్రఖ్యాత నాటకకర్త రమణారెడ్డి, తాకట్టులో భారతదేశం గ్రంథకర్త స్వర్గీయ తరిమెల నాగిరెడ్డి, పంచసహస్రావధానం చేసిన మేడసాని మోహన్, నాగఫణిశర్మ లాంటి వారి గురించి రాయకపోవడం విడ్డూరం. ఇలా పేర్కొంటూపోతే పెద్ద లిస్ట్ అవుతుంది.

అలాగే తెలుగు నాటక రంగాన్ని అంతర్జాతీయ వీధుల్లో కవాతు చేసిన బళ్ళారి రాఘవ, నేటి తరంలో సిద్ధప్పనాయుడు.. లాంటి వారి గురించి రాయకపోవడం బాధాకరం.

మదనపల్లిలో ఋషివ్యాలీ స్కూల్, జిడ్డు కృష్ణమూర్తి ప్రభావం... లాంటి అంశాలు మరుపుకు తావులేనివి. నాలుగు జిల్లాల్లో 68 మంది సాహితీవేత్తలతో గ్రంథం రాస్తే అది అసమగ్రమే కదా!!

రాళ్ళపల్లి, బవిజేపల్లి, మానపల్లి, శంకరంబాడి, కోలాచలం, రాచమల్లు, వావికొలను, గడియారం, సభా, గంగాధరం, కేతు, పుట్టపర్తి, ధర్మవరం, మధురాంతకం, పులికంటి, జయరాం, కేశవరెడ్డి, సింగమనేని, అంతటి, వల్లంపాటి, జి.ఎన్.రెడ్డి, కల్లూరు గార్లపై రాసిన వ్యాసాలు... ప్రశంసనీయంగా వున్నాయి.

అలాగే కనీసం జిల్లాలవారీగా (4 జిల్లాల్లో) కవులు, రచయితల పట్టిక ఇస్తే గ్రంథం సమగ్రతకు సరితూగకున్నా... కొంతవరకు... న్యాయం చేసినట్లు అనిపించేది... మలి ముద్రణల్లో సరిచేస్తే పాఠకులకు, పరిశోధకులకు, పండితులకు, పామరులకు ప్రయోజనకారిగా భాసిస్తుంది.

- తంగిరాల చక్రవర్తి

ఆలోచింపచేసే 'దగ్ధ దృశ్యం'



దగ్ధ దృశ్యం (క)
(కవితా సంపుటి)
కొండెపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్
పేజీలు : 110, వెల : 60/-,
ప్రతులకు :
డా॥ కొండెపోగు డేవిడ్ లివింగ్‌స్టన్
అరుణోదయ స్కూల్ ఎదుట,
తర్లుపాడు రోడ్,
మార్కాపురం - 523316.
ప్రకాశం జిల్లా.
సెల్ : 9440211120.

డా॥శిఖామణి, బి.హనుమారెడ్డి గార్లు ఈ గ్రంథానికి ముందు మాటలు రాశారు. కవి ఈ కవితా సంపుటిని వారి జీవన సహచరి 'లీనా'కు, కుమారుడు ప్రత్యూష యశస్వి, కుమార్తె స్వప్నికా రాజ్ఞిలకు అంకితం చేశారు. ఒరిస్సాలోని క్రైస్తవ మత బోధకుడు గ్రాహెమ్‌స్టెయిన్ దహనకాండ నుండి ఒరిస్సాలోని కాంద్‌మాల్ క్రైస్తవ సన్యాసులపై జరిగిన అత్యాచారం, మరణకాండ వరకు జరిగిన, జరుగుతున్న ఘోరాన్ని క్రైస్తవులు మౌనం వీడి మాట్లాడవలసిన అవసరాన్ని ఈ 'దగ్ధదృశ్యం' చెపుతోంది అని డా॥శిఖామణి పేర్కొన్నారు ముందుమాటలో...

పట్టణీకరణ/నగరీకరణ వేస్తున్న వెర్రితలలు, సమాజం చెందుతున్న తీవ్రపరిణామం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు అంటారు బి.హనుమారెడ్డి. దాదాపు అన్ని కవితలూ.. ఆలోచింపజేస్తాయి.

'బహిరంగ స్నేహితుడు' కవిత (పేజీ21)లో కవి ఇలా అంటాడు.

పోస్ట్ మోడర్న్ కోటు కింద / మూఢత్వాల జోలె దాస్తూ వుండు / పైపై సంఘీభావాలు ప్రకటిస్తూ / 'పజిల్'గా మిగిలిపోతూ వుండు / కవిగోష్ఠుల్లో విప్లవాలు పండిస్తూ / కమండల తీర్థంలో ఈదులాడుతూ వుండు. 'దగ్ధదృశ్యం' (పేజీ 28) కవితలో కవి తన భావజాలాన్ని స్పష్టపరిచిన తీరు ప్రశంసనీయం

"మేధావుల్ని, మహనీయుల్ని మరుగుచేస్తూ
మీడియా కావలసినంత మురికిని
ముఖాలమీదికి చిమ్ముతోంది" అంటారు.

'గద్దలు క్షేమం' (పేజీ36) కవిత కూడా చాలా ప్రశంసనీయంగా వుంది.

"చుండూరు కావచ్చు / ముదిగొండ కావచ్చు / వాకపల్లి కావచ్చు / కడకు ఖైర్లాంజి కావచ్చు / ఏవూరైతేనేం?

అంతా భద్రంగానే వుంటారు / ఆదివాసీ ఊరపిచ్చుకలు / మైనారిటీ మైనాలు/

బలహీన విహంగాలు / నోరు తెరిచే దళిత కపోతాలు తప్ప
గద్దలెప్పుడూ క్షేమంగానే వుంటాయి- ఎరమీద కన్నేసి"

109 పేజీల్లో రాసిన 52 కవితలు.... పాఠకుల్ని చదివిస్తాయి. ఆలోచింపచేస్తాయి.

గాయం కొత్తదేమీ కాదు/ వానకోయిల ఏడ్పు పాట / సముద్ర గాయం/ మౌనభంగం/ కామోన్మాదం/ బఱ్రెమాత / విముక్తిగీతం/ తాజ్‌మహల్ / పవిత్ర దుఃఖం" కవితలు సంక్షోభ సందర్భంలోంచి వెలువడ్డాయి... అనిపిస్తుంది. వర్ణ వ్యవస్థ సాగిన ఈ అక్షర సమరం వాస్తవిక దృశ్యమే. కవి మరింత పదునైన భాష భావావేశంతో నిబద్ధతతో మరిన్ని మంచి కవితలు రాయాలి.

- టి.సి

నిమ్మ పండుగ



విదేశాలలో వింత వింత పండుగలు జరుపుకోవడం పరిపాటే! అయితే ఈ వింత పండుగ గురించి మీరు విన్నారా? వినుండరులెండి. ఫ్రాన్సులో ఆ పండుగను జరుపుకుంటారు. అయితే ఈ సంవత్సరం జరుపుకుంటోంది డెబ్బయ్ ఏడవది. అయ్యయ్యో! అసలు ఆ పండుగ పేరు చెప్పలేదు కదూ. దాని పేరు నిమ్మకాయల పండుగ! ఈ సంవత్సరంలో ఈనెల 12 నుండి మార్చి 3 వరకు ఈ పండుగను జరుపుకుంటున్నారు. ప్రతి సంవత్సరం ఈ పండుగను చూడ్డానికి 2,30,000 మంది వస్తారట. రైవరియాలో కార్నివాల్ తరువాత జరిగే అతి పెద్ద విశేషమిది. ఈ పండుగ సమయంలో 300 మంది నిపుణులు తమ సేవలు అందిస్తారు. అంతేకాదు 145 టన్నులు సిట్రస్ పండ్లు అవసరమవుతాయి. అమ్మో! అన్ని పండ్లు తింటారా అని ఆశ్చర్యపోకండి. ఎందుకంటే అవి తినడానికి కాదు. ఇక్కడి ఫోటోలు చూశారు కదా. రాక్షసబల్లి, పుస్తకం, ఏనుగు, కట్టడాలు... వాటితో చేసినవే!









పొట్టి రాజు - చిట్టి రాణి

-పుప్పాల కృష్ణమూర్తి

జరిగిన కథ : గోపమ్మ చేసిన మట్టిబొమ్మకు ప్రాణం వస్తుంది. అతనికి రాజు అని పేరు పెట్టుకుంటారు గోపమ్మ, గోపయ్య. పొట్టిరాజు తండ్రికి అన్ని పనుల్లో సాయం చేస్తుంటాడు. కుండలకోసం మట్టికి వెళ్లి రెండు చేపలను తెస్తాడు. వాటిలో ఉంగరం, తాలిబొట్టు ఉన్న నానుతాడు కనిపిస్తాయి. తండ్రి చేసిన కుండలను సంతలో అమ్మడానికి బయలుదేరతాడు. అంతే ఉంగరం, తాలిబొట్టుకు మెరుగు పెట్టిద్దామని వాటిని కూడా తీసుకెళ్తాడు. దారి మధ్యలో అడవిలో దొంగలుంటారు వెళ్లొద్దని ఒక తాత చెప్పినా 'నాకేం భయం లేదులే తాత' అంటూ వెళ్తాడు. ఆ తర్వాత....

రాజు భయపడకుండా బండినలాగే ముందుకు నడిపించ సాగాడు. వాళ్లు కత్తులు మెరిపిస్తూ ఒకడు వెనుక పోలును పట్టుకున్నాడు పైకెక్కేందుకు. మరొకడు బండి చక్రాన్ని పట్టుకుని పైకెక్కుదామనుకున్నాడు. అప్పుడు "బండికి మీకు అంటుల్లా" అన్నాడు పొట్టిరాజు. అంతే, వాళ్ల చేతులు బండికి అంటుకుపోయాయి. ఒకడి చేతులు బండి పోలుకు, మరోడి చేతులు చక్రానికి అతుక్కుపోయాయి. బండి ముందుకు కదులుతుంటే, పోలును పట్టుకుని ఒకడు, బండి చక్రంతో పాటు తిరుగుతూ మరొకడు బండి వెంట వెళ్లసాగారు. ఎంత లాక్కున్నా చేతులు వదిలిరాలేదు. గట్టిగా అతుక్కుపోయారు. పెద్దగా కేకలు పెట్టి భయపెట్టారు. చంపుతామని బెదిరించారు. వదిలేయమని ప్రాధేయపడ్డారు. తాము దోచుకుని దాచుకున్న సంపదంతా ఇస్తామని ఆశపెట్టారు. కానీ రాజు వినలేదు. చిరునవ్వుతో వారిని చూస్తూ "ఇంత కాలానికి మీ పాపం పండిందిరా. ఎంతమంది బాటసారులను చంపారు. మరెంత మందిని దోచుకున్నారు. మీకు ప్రజలే తగిన శిక్ష విధిస్తారు. రండి" అన్నాడు. బండిని నేరుగా సంతలోకి తీసుకుపోయాడు. బండికి కట్టేసినట్లు ఇద్దరు రావడం చూశారు సంత జనం. వాళ్లలో చాలా మందిని దోచుకుని, కొట్టి పంపించారు గతంలో ఈ దొంగలు. వాళ్లను చూడగానే "అరే వీళ్లు మనల్ని దోచుకున్న దొంగలు. రాక్షసి ముండా కొడుకులు. వాళ్లని వదలకండి" అని కేకలు పెడుతూ బండి దగ్గరకు వచ్చారు. రాయో, రప్పో, కర్రో ఏది దొరికితే దాంతో వాళ్లమీద పడి కొట్టారు. దొంగల ఒళ్లు హూనమైపోయింది. జనం కొట్టిన దెబ్బలతో స్పృహ తప్పిపోయారు. అప్పుడు "బండికి దొంగలకు విడిల్లా" అన్నాడు పొట్టిరాజు. అయస్కాంతంలా అతుక్కున్న వాళ్ల చేతులు విడిపడ్డాయి. కానీ వాళ్లు తిన్న దెబ్బలతో దిమ్మతిరిగి నేలకు కరుచుకుని పడి వున్నారు. వాళ్లనలా వదలకుండా ఒక తాడు తీసుకుని ఇద్దరినీ ఒకే చెట్టుకు కట్టేశారు వర్తకులు.

ఈ వార్తను ఆఘమేఘాల మీద రాజుకు చేరవేశారు గూఢచారులు. వెంటనే రాజు సంబరంగా రథం తీసుకుని మంత్రితో బయలు దేరాడు. "నేనూ వస్తా నాన్నా" అని చిట్టిరాణి మారాం చేసింది. "సరే రా" అనడంతో రాజ దుస్తులు ధరించి బయలు దేరింది. ఆమె ఉన్నది బెత్తెడే అయినా, ప్రత్యేకంగా పెద్ద రథం మీద సంతకు ప్రయాణమైంది.

రాజు రథం దిగి, చెట్టుకున్న దొంగల్ని పరిశీలించాడు. కొన్నేళ్లుగా తన కంటిమీద కునుకులేకుండా చేస్తున్న దొంగలు వీళ్లేనని నిర్ధారణ చేసుకున్నాడు. భటులు చెప్పిన ప్రకారం బండి వద్దకు వెళ్లి "మూరెండంత కూడా లేవు. ఎలా పట్టుకున్నావు వీళ్లని" అన్నాడు ఆసక్తిగా పొట్టిరాజును చూస్తూ.

"ఎత్తుదేముందండి. అంతెత్తు వున్న జిరాఫీని, చిన్న పులిపిల్ల చంపుతుంది. చిన్న క్రిమి పెద్ద ఏనుగును సైతం మూలకు పడేస్తుంది. ఎత్తుకంటే తెలివితేటలు ముఖ్యం. మీ అమ్మాయి మాత్రం ఎంతెత్తుంది. బెత్తెడే లేదూ. అయినా తెలివితేటల్లో ఎవరికీ తీసిపోదుకదా" అన్నాడు పొట్టిరాజు.

"నిజమే. నా బంగారు తల్లికి అద్భుతమైన తెలివి తేటలున్నాయి. ఒక్కోసారి దానికొచ్చిన ఆలోచనలు, మా మంత్రికి కూడా రావు" అన్నాడు పాప తలమీద చెయ్యేసి దువ్వుతూ.

"కుండలు అమ్ముదామని సంతకు వస్తున్నాను. ఎలాగూ సంతకు వెళ్తున్నాను కదాని మా అమ్మ తనకు కాబోయే కోడలి కోసం దాచి వుంచిన ఉంగరం, నానుతాడు మెరుగు పెట్టించుకుని రమ్మంది. వాటిని దోచుకుందామనుకున్నారీ దొంగ వెధవలు అడవిలోంచి వస్తుంటే. వీళ్లు అడ్డు తగులుతారనే బండికి బంక రాశాను. అతుక్కుపోయారు. వాళ్లనలాగే సంతకు పట్టుకొచ్చాననుకోండి. ఇదిగో ఇదే వుంగరం, నానుతాడు" అని జేబులో ఉన్న వాటిని తీసి రాజుకు చూపించాడు.

పొట్టిరాజు చేతిలో నుండి తీసుకుని చూడసాగాడు రాజు. పక్కనే వున్న చిట్టిరాణి గబాల్న తండ్రి చేతిలోంచి అందుకుని "నేను వీటిని పెట్టుకుని చూస్తా" అంది ఉంగరం పెట్టుకోబోతూ.

"అయ్యో పెట్టుకోకండి రాకుమారి. నాకు కాబోయే భార్య మాత్రమే వాటిని ధరించాలి. అంతేకాదు, అవి నాక్కాబోయే భార్య ధరిస్తే మాత్రమే ఎంత తీసినా రావు. అవి శరీరంలో భాగమైపోతాయి" అన్నాడు పొట్టిరాజు.

"అట్లా ఎందుకౌతుంది? నగలు ఎవరైనా ధరించొచ్చు. మా అమ్మ నగలు ఎన్ని సార్లు నేను ధరించలేదు? మీదంతా చాదస్తం" అంది వేలికి వుంగరం తొడుక్కుంటూ. తర్వాత తాళి బట్టుతో వున్న నానుతాడును కూడా మెడలో వేసుకుని సరి చేసుకోసాగింది.

"ఇంక నా నగలు వస్తాయో రావో" అన్నాడు పైకే.

"నీ నగలు ఎక్కడికీ పోవు. నేను భద్రంగా ఇప్పిస్తాగా" అన్నాడు రాజు.

"అవి అతుక్కుపోతే మీరెలా ఇస్తారు" అని "ఉంగరం, తాళిబట్టు చిట్టిరాణికి అంటుల్లా" అన్నాడు ఎవరికీ వినపడకుండా.

చిట్టిరాణి ఆనందపడి, తిరిగి ఇద్దామని వాటిని తీయబోయింది. కానీ అవి ఎంతకూ రాలేదు. శరీరానికి అతుక్కుపోయాయి. రాజు, మంత్రి కూడా ప్రయత్నించారు. అయినా అవి ఊడి రాలేదు.

"నేను చెప్పానా రాజుగారూ! నాకు కాబోయే భార్య ధరిస్తే మళ్లీ తీయలేమని. ఇదంతా ఒక ముని వరం. ఆముని వరం వల్లనే నేను పుట్టానట. ఇంత చిన్న బాలుణ్ణిచ్చారు. వీడికి భార్య ఎక్కడ దొరుకుద్ది? అని మా అమ్మ మునిని అడిగిందట. అప్పుడా ముని, "ఇదిగో ప్రధానపు వుంగరం, తాళిబొట్టు వున్న నానుతాడు. ఇవి ధరిస్తే ఎవరి నుంచైతే తీయలేమో, ఆమే ఇతని భార్య" అని ఇవి ఇచ్చాడు. నేను అప్పటికే చెబుతూనే వున్నా ధరించవద్దని. కానీ వింటేనా?" అన్నాడు బాధపడిపోతూ.

మంత్రి రాజును పక్కకు పిలిచి "మహారాజా, మీకు వరం వల్లనే ఆ అమ్మాయి పుట్టింది. ఆ బాలుడూ వరం వల్లనే జన్మించాడు. మీ అమ్మాయి బెత్తెడంత. ఆ బాలుడు జానెడంత. ఈడు జోడు సరిపోయింది. పెళ్లిచేస్తే మీదో బాధ్యత తీరిపోద్ది. అబ్బాయి సామాన్యుడు కాదు. ఎవరూ పట్టుకోలేని దొంగల్ని పట్టుకున్న పరాక్రమశాలి. వివేకవంతుడు. మన రాజప్రాసాదంలో ఇటువంటి వాడుండడం ఎంతో అవసరం" అన్నాడు.

"తోటి రాజులు నవ్వుతారేమో?" అన్నాడు సంశయిస్తూ.

"అలా నవ్వే రాజులెవరూ మీ అమ్మాయిని వాళ్ల అబ్బాయిలకి చేసుకోడానికి ఒప్పుకోరు. వాళ్లంతా మీలాగే ఆరడుగుల ఆజానుబాహులు. సంసారం చేసేదెలా?" అన్నాడు వివరిస్తూ.

"సరే, నేనైతే ఒప్పుకోక తప్పడంలేదు. కానీ అమ్మాయి ఏమంటుందో ఏమో?" అన్నాడు బిడ్డవైపు చూస్తూ.

చిట్టిరాణి పొట్టిరాజు చేతిలో చేయివేసి నవ్వుతూ ప్రేమగా గుసగుసలాడసాగింది.

"నా కూతురు కోరుకున్న దాన్ని నేనింతవరకూ ఇవ్వకపోవడం జరగలేదు. ఆమె మనసులో మాట కనిపెట్టే నీ మీద ప్రేమ కలిగిందని అర్థం చేసుకున్నాను. నా చిట్టితల్లిని నీకు ఇచ్చి త్వరలోనే వివాహం జరిపిస్తాను. ముందు కోడలిని మీ అమ్మా నాన్నకు చూపించు" అన్నాడు రాజు.

కుండలు మొత్తం అమ్ముడైపోయి, బండి ఖాళీగా వుంది. చిట్టిరాణి ముసి ముసి నవ్వులతో నగలు సర్దుకుంటూ, దుస్తులు సవరించుకుంటూ రథాన్ని వదిలేసి ఎద్దుల బండి ఎక్కి కూర్చుంది. పొట్టిరాజు బండి ఎక్కి తొట్లో కూర్చుని చెండ్రాకోలతో ఎద్దుల్ని అదిలించాడు. బండి ఇంటివైపుకు పరుగందుకుంది.

రాజు అతని పరివారం దొంగల్ని తీసుకుని రాజధానికి వెళ్లిపోసాగారు. దుకాణంలో ఓ వర్తకుడు మరో వర్తకుడితో "దొంగల్ని పట్టుకుంటే రాజు పెద్దబహుమానం ఇస్తానన్నాడు కదా. మరి బహుమానం ఎప్పుడిస్తాడు" అన్నాడు అమాయకంగా.

"వెర్రివాడా! రాజకుమారిని కుమ్మరి కొడుక్కివ్వడమే పెద్ద బహుమానం" అన్నాడు.